ప్రజాశక్తి

గురువారం 31 అక్టోబర్ 2024   8 పేజీలు

గుంటూరు

పల్నాడు

బాణసంచా వ్యాపారంపై వాన దెబ్బ

పలు పట్టణాల్లో తడిసిన టపాసులు - అచ్చంపేట మండలంలో పిడుగుపాటుకు రైతు మృతి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరులో బాణసంచా దుకాణాల సముదాయం వద్ద నిలిచిన వర్షపు నీరు

గుంటూరు, పల్నాడు జిల్లాల్లో బుధవారం సాయంత్రం ఒక మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. పలు ప్రాంతాల్లో పిడుగులు పడ్డాయి. పల్నాడు జిల్లా అచ్చంపేట మండలం అంబడిపూడిలో పిడుగు పడి కూనిశెట్టి నారాయణ (35) అనే రైతు మృతి చెందాడు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురవడంతో పత్తి పంటకు నష్టం జరుగుతుందని చెబుతున్నారు. పత్తి చేతికొచ్చే సమయంలో కురిసిన వర్షంతో పూత, కాయ, తీయడానికి సిద్ధంగా ఉన్న పత్తి దెబ్బతింటోందని రైతులు వాపోతున్నారు.

మరోవైపు ఆకాల వర్షంతో పలు పట్టణాల్లో బాణసంచా విక్రయాలకు ఆటంకం ఏర్పడింది. గురువారం దీపావళి కావడంతో వ్యాపారుంతా బుధవారం ఎక్కువ విక్రయాలు జరుగుతాయని భావించి సరుకు అంతా దుకాణాల్లో ఉంచారు. రోడ్డుపక్కన పెట్టిన దుకాణాల్లో ఆకస్మికంగా వచ్చిన వర్షం తీవ్ర నష్టం చేకూర్చింది. వర్షంతో తడిసిన టపాసులను విక్రయించే అవకాశం కూడా లేదని పలువురు వ్యాపారులు వాపోయారు. గతంలో మాదిరిగా ఇప్పుడే పండగకు ముందే బాణసంచా కొనే పరిస్థితి లేదని పండగ ముందు రోజు సాయంత్రం, పండగ రోజు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు వ్యాపారం అంతా జరుగుతుందని, ఈ సమయంలో వర్షం రావడం వల్ల తమకు తీవ్ర నష్టమేనని బాణసంచా వ్యాపారి శ్రీనివాసరావు తెలిపారు. తాడేపల్లి, మంగళగిరిలో కుంభ వృష్టిగా వర్షం కురవడంతో వ్యాపారులు తమ సరుకు కాపాడుకోవడం కోసం హాహా కారాలు చేశారు. గుంటూరులో కొద్దిసేపట్లోనే భారీ వర్షం వల్ల తాత్కాలిక టెంట్లు కింద పెట్టిన దుకాణాలు బాగా దెబ్బతిన్నాయి. కొన్నిచోట్ల మాత్రం వ్యాపారులు హడావుడిగా టార్పాలిన్ పట్టాలు, గోతాలు కప్పి బాణసంచా త డ వ క ుం డా

▶ 2లో

టిటిడి బోర్డులో జానకిదేవి, కృష్ణమూర్తి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు, పల్నాడు జిల్లాలకు చెందిన ఇద్దరు నాయకులకు తిరుమల తిరుపతి దేవస్థానం (టిటిడి) సభ్యులుగా నియమితులయ్యారు. మంగళగిరికి చెందిన తమ్మిశెట్టి జానకిదేవి, గురజాలకు చెందిన మాజీ ఎమ్మెల్యే జంగా కృష్ణమూర్తికి టిటిడి బోర్డులో సభ్యులుగా నియమిస్తూ టిటిడి ప్రకటన విడుదల చేసింది. తమ్మిశెట్టి జానకిదేవి టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధిగా ఉన్నారు. ఆమె 2004, 2009లో బిజెపి, ప్రజారాజ్యం నుంచి పోటీ చేసి ఓడిపోయారు. 2014లో టిడిపిలో చేరారు. మాజీ ఎమ్మెల్యే జంగా కృష్ణమూర్తి ఎమ్మెల్సీగా ఉంటూ గత ఎన్నికలప్పుడు వైసిపిని వీడి టిడిపిలో చేరారు. పార్టీ ఫిరాయింపుల చట్టం కింద ఆయన్ను ఎమ్మెల్సీగా ఇటీవల మండలి చైర్మన్ అనర్హత వేటు వేశారు. రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ చైర్మన్ లేదా ఎమ్మెల్సీ పదవిని ఆశించిన ఆయనకు ప్రస్తుతం టిటిడి బోర్డు సభ్యులుగా నియమించారు.

ఎసిసి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులకు న్యాయం చేయడానికి

ప్రభుత్వం జోక్యం చేసుకోవాలి

ప్రజాశక్తి-తాడేపల్లి

సుదీర్ఘకాలంగా పరిష్కారానికి నోచని ఎసిసి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సిఐటియు గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.నేతాజీ కోరారు. కార్మికులు చేస్తున్న పోరాటంలో భాగంగా బుధవారం సభను యూనియన్ నాయకులు కె.స్టీవెన్ అధ్యక్షతన నిర్వహించారు. పోరాటానికి మద్దతుగా నేతాజి మాట్లాడుతూ కార్మికులకు లేబర్ ట్రిబునల్ కోర్ట్, హైకోర్టు అనుకూలంగా తీర్పు ఇచ్చిన ప్రభుత్వాలు అమలు చేయకపోడం

▶ 2లో

ఉమ్మడి కృష్ణా - గుంటూరు జిల్లాల శాసనమండలి పట్టభద్రుల నియోజకవర్గం

పిడిఎఫ్ అభ్యర్థిగా కెఎస్.లక్ష్మణరావు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్

ఉమ్మడి కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం ప్రోగ్రెసివ్ డెమొక్రటిక్ ఫ్రంట్ (పిడిఎఫ్) అభ్యర్థిగా కె.ఎస్.లక్ష్మణరావు (కలగర సాయి లక్ష్మణరావు) పోటీ చేస్తున్నారు. విజయవాడలోని ప్రజా సంఘాల కార్యాలయంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆయనను పిడిఎఫ్ అభ్యర్థిగా ప్రకటించారు. 2025 మార్చిలో కృష్ణా - గుంటూరు ఉమ్మడి జిల్లాల శాసనమండలి గ్రాడ్యుయేట్ నియోజకవర్గ ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న లక్ష్మణరావుకు ఉద్యోగ, ఉపాధ్యాయ, అధ్యాపక, కార్మిక, ప్రజా సంఘాలు బలపరుస్తున్నాయి. 2007 నుండి రాజ్యాంగ విలువలకు కట్టుబడి ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, కార్మికులు, రైతులు, నిరుద్యోగులు, మహిళలు, అంగన్వాడీలు, విద్యార్థులు, యువజనులు, వివిధ సామాజిక వర్గాల సమస్యలను శాసనమండలిలో లేవనెత్తుతూ వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నారు. బయట జరిగే అనేక ప్రజా ఉద్యమాలకు మద్దతుస్తూ వస్తున్నారు. ప్రస్తుతం సిట్టింగ్ ఎంఎల్‌సిగా ఉన్న ఆయన

▶ 2లో

పిడిఎఫ్ అభ్యర్థిగా కెఎస్.లక్ష్మణరావు

(మొదటి పేజీ తరువాయి)

గుంటూరులోని హిందూ కళాశాలలో రాజనీతిశాస్త్రంలో లెక్చరర్‌గా పనిచేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కష్ణా-గుంటూరు ఉపాధ్యాయ నియోజకవర్గానికి 2007లో జరిగిన ఎన్నికల్లో తొలిసారిగా పిడిఎఫ్ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు. 2009 ఎన్నికల్లోనూ ఇదే నియోజకవర్గం నుండి ఎంఎల్‌సిగా గెలుపొందారు. ఆయన 2007 మార్చి 26 నుండి 2015 మార్చి 25 వరకూ ఆయన రెండు దఫాలు ఎంఎల్‌సిగా ఉన్నారు. రాష్ట్ర విభజన అనంతరం ఇదే నియోజకవర్గానికి 2015 మార్చి 22న జరిగిన ఎన్నికల్లో పోటీచేసి ఓడిపోయారు. 2019లో ఉమ్మడి గుంటూరు-కృష్ణాజిల్లాల గ్రాడ్యుయేట్ నియోజకవర్గ ఎన్నికల్లో ఎంఎల్‌సిగా పోటీ చేసి 68,120 ఓట్ల మెజారిటీతో తిరిగి ఎన్నికయ్యారు. 2019 మార్చి 27న ఆయన ఎంఎల్‌సిగా బాధ్యతలు స్వీకరించారు.

ప్రభుత్వం జోక్యం చేసుకోవాలి

(మొదటి పేజీ తరువాయి)

ఏమిటన్నారు. మంగళగిరి నియోజకవర్గం నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రి నారా లోకేష్ జోక్యం చేసుకొని, ముఖ్యమంత్రిని ఒప్పించాలని, కార్మికులకు నష్టపరిహారం వచ్చే విధంగా కృషి చేయాలని కోరారు. ఎన్నికలకు ముందు తాము అధికారంలో కొట్టే సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యను పరిష్కరిస్తామని మంత్రి లోకేష్ హామీ ఇచ్చారని గుర్తు చేశారు. న్యాయంగా తమకు రావాల్సిన నష్టపరిహారం రాక, కడుపు ఖాళీ ఆందోళనకు దిగిన కార్మికులకు అండగా ఉండవలసిన పోలీసులు, నేరస్తుల్ని వెంటాడినట్టు వెంటాడి, బైండవర్ కేసులు నమోదు చేయడం పట్ల అసహనం వ్యక్తం చేశారు. ఏడుగురు మీద అక్రమ కేసులు బనాయించి పోలీస్ స్టేషన్, ఎమ్మార్వో కార్యాలయాలు చుట్టూ తిప్పటం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. సిఐటియు తాడేపల్లి పట్టణ కార్యదర్శి వి.దుర్గారావు మాట్లాడుతూ న్యాయం జరిగే వరకు జరిగే సుదీర్ఘ పోరాటానికి కార్మికులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సిపిఎం పట్టణ కార్యదర్శి బి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల న్యాయమైన పోరాటానికి సిపిఎం పూర్తి అండదండలిస్తుందన్నారు. కార్యక్రమంలో కార్మికులు బి.సూర్యప్రకాష్, ఎం.ఆశీర్వాదం, వై.సుబ్బారావు, రమాదేవి, బి.అంకయ్య, ఎస్‌కె.ఇమాంబి, నారమ్మ, శివకుమారి, యు.రమణ, కిరణ్, కృష్ణ, సాంబశివరావు, నవనీతం, బి.ప్రభాకర్ పాల్గొన్నారు.

విశ్రాంత ప్రిన్సిపల్‌కు పురస్కారం

ప్రజాశక్తి - విజయపురిసౌత్

నాగార్జునసాగర్ ఎపిఆర్‌జెసి విశ్రాంత ప్రిన్సిపాల్ చందు ఆంజనేయులుకు సర్దార్ వల్లభాయ్ పటేల్ పురస్కారాన్ని హోప్ స్వచ్ఛంద సేవా సమితి నిర్వాహకులు హైదరాబాద్ కళానిలయంలో అందజేశారు. సమితి నిర్వాహకులు మాట్లాడుతూ సామాజిక సేవ, రచన, కవిత్వం పలు రంగాల్లో చందు ఆంజనేయులు ప్రతిభ కనబరిచారన్నారు. చందు ఆంజనేయులు మాట్లాడుతూ సమాజ సేవ ఎంతో పవిత్రమైనదన్నారు. భవిష్యత్తులో మరిన్ని సేవలు అందించేందుకు కృషి చేస్తానన్నారు.

సిమెంటు ఫ్యాక్టరీలు నిర్మించాలి

ప్రజాశక్తి - దాచేపల్లి

గురజాల నియోజకవర్గాల్లోని వివిధ గ్రామాల్లో రైతులు వద్ద నుండి కొనుగోలు చేసిన భూముల్లో సిమెంట్ ఫ్యాక్టరీ నిర్మాణం చేపట్టాలని ఎఐవైఎఫ్ పల్నాడు జిల్లా కన్వీనర్ సుభాని డిమాండ్ చేశారు. స్థానిక నాగిరెడ్డి కమ్యూనిటీ హాల్లో బుధవారం జరిగిన మహాసభలో ఆయన మాట్లాడుతూ రైతుల దగ్గర నుండి తక్కువ రేట్లకు భూమిని తీసుకుని ఏళ్లు గడుస్తున్నా ఫ్యాక్లరీలు నిర్మించ లేదని, భూములిచ్చిన రైతులు కూలీలుగా మారారని చెప్పారు. సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి షేక్ హుస్సేన్ మాట్లాడుతూ ఒక్కో గ్రామానికి 10-15 బెల్ట్‌షాపులు ఉన్నాయని, వీటిని ఎత్తేయించాలని కోరారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు.

కలిసి అభివృద్ధి చేసుకుందాం

పల్నాడు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్

ప్రజాశక్తి- పల్నాడు జిల్లా

టిడిపి, జనసేన, బిజెపి కృషితోనే రాష్ట్రంలో కూటమి గెలుపు సాధ్యమైందని, మూడు పార్టీలు సమైక్యంగా కలిసి రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకుందామని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి, పల్నాడు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని ఓ ఫంక్షన్ హాలులో బుధవారం పల్నాడు జిల్లా కూటమి నాయకుల ఆత్మీయ, జిల్లా అభివృద్ధి సమీక్ష సమావేశం జరిగింది. సమావేశానికి టిడిపి పల్నాడు జిల్లా అధ్యక్షులు కొమ్మాలపాటి శ్రీధర్ అధ్యక్షత వహించారు. మంత్రి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఇచ్చిన హామీ మేరకు సామాజిక పింఛనును రూ.3 వేల నుండి రూ.4 వేలకు పెంచామని, దీపావళి కానుకగా 3 గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధమైందని చెప్పారు. ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తామన్నారు. మాజీ మంత్రి డాక్టర్ కోడెల శివప్రసాదరావు విగ్రహాన్ని జిల్లా ఏరియా వైద్యశాలలో త్వరలో ప్రారంభిస్తామని, కోడెల స్మృతి వనం ఏర్పాటుకు కృషి చేస్తానని అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కలిసికట్టుగా పని చేసి ఆలపాటిని గెలిపించాలన్నారు. ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ రానున్న 5 ఏళ్లలో రోడ్లు, రైల్వే లైన్లు, హెల్త్, స్పోర్ట్స్, పోలవరం ప్రాజెక్టు, రాజధాని నిర్మాణాలకు సంబంధించి రూ.2 లక్షల కోట్లతో అభివృద్ధి చేసుకోబోతున్నామని చెప్పారు. అమృత్ పథకం ద్వారా జిల్లాలోని ఇంటింటికి కుళాయిలు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. 16437 టీచర్ పోస్టులను భర్తీకి సిఎం చంద్రబాబుసంతకం చేశారన్నారు. త్వరలోనే నామినేటెడ్ పోస్టులను కూటమి అధినాయకులు భర్తీ చేస్తారని చెప్పారు. మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ కక్ష పూరిత రాజకీయాలు, అల్లర్లు సృష్టించవద్దని, వివాదాలకు తావు లేకుండా పాలన ఉండాలని చంద్రబాబు చెప్పారని అన్నారు. వైసిపి నాయకులు, కార్యకర్తలు రెచ్చగొట్టినా, కూటమి ప్రభుత్వంపై ఆరోపణలు చేసినా మిన్నకుండిపోయామని అన్నారు. అధినేత ఆదేశిస్తే అవినీతి అక్రమాలకు, దౌర్జన్యాలకు పాల్పడి ప్రజలను వేధింపులకు గురి చేసిన వైసిపి నాయకులు రాష్ట్రం నుండి తరిమి కొడతామని హెచ్చరించారు. వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ టిడిపి సానుభూతి పరులన్న నెపంతో రైతులపై రౌడీషీట్ తెరిపించిన ఘనత వైసిపిదని విమర్శించారు. సమావేశంలో ఎమ్మెల్యేలు ప్రత్తిపాటి పుల్లారావు, కన్నా లక్ష్మీనారాయణ, యరపతినేని శ్రీనివాస రావు, డాక్టర్ చదలవాడ అరవిందబాబు, భాష్యం ప్రవీణ్, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి, కూటమి పార్టీల నాయకులు కోడెల శివరామకృష్ణ, మక్కెన మల్లికార్జున రావు, ఎ.సుధాకర్ బాబు, గాదె వెంకటేశ్వర్లు, డాక్టర్ కె.లలిత్ సాగర్, జి.కోటేశ్వర రావు, కె.విజయ్ కుమార్ పాల్గొన్నారు.

ఎన్నారై కాలేజీలో మెగా రక్తదాన శిబిరం

ప్రజాశక్తి - మేడికొండూరు

మేడికొండూరు సమీపంలోని ఎన్ఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో మెగా రక్తదానం శిబిరం బుధవారం నిర్వహించారు. ప్రిన్సిపాల్ కోటా శ్రీనివాస్ మాట్లాడుతూ రక్తదానం దానం ఆవశ్యకత, రక్తదానం చేయడం వల్ల కలిగే ప్రయోజనాలు, రక్తదానం చేసిన వ్యక్తి యొక్క ఆరోగ్య పరిస్థితుల గురించి వివరించారు. సరైన సమయంలో రక్తం అందక అనేకమంది జీవితాలు ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయని, అన్నారు. ప్రతి ఆరోగ్యకరమైన విద్యార్థి రక్తదానం చేయాలని చెప్పారు. 72 యూనిట్ల రక్తాన్ని సేకరించి శ్రీ వెల్ఫేర్ బ్లడ్ బ్యాంక్‌కు అందించారు. ఎన్ఎస్ఎస్ విద్యార్థులు బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు. రక్తదాన శిబిరం నిర్వహించడం పట్ల కళాశాల సెక్రటరీ రాజేంద్రప్రసాద్ అభినందించారు.

ఫిల్మ్ స్టడీస్ ప్రవేశాలకు 2 ఆఖరు తేదీ

ప్రజాశక్తి - ఎఎన్‌యు : ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం లో ఫిలిం స్టడీస్ విభాగంలో ప్రవేశాలకు నవంబర్ రెండవ తేదీ చివరి తేదీన నిర్ణయించినట్లు విభాగం కోర్స్ కోఆర్డినేటర్ డాక్టర్ జై మధుబాబు తెలిపారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ కాలేజీ అఫ్ ఆర్ట్స్ అండ్ కామర్స్, టీవీ అండ్ ఫిలిం స్టడీస్ విభాగం రెండేళ్ల ఎం.ఎ ఫిల్మ్ స్టడీస్ సెల్ఫ్‌ఫైనాన్స్ కోర్సు ప్రారంభించి 2024-25 విద్యా సంవత్సరానికి ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు. యుజిసి , ఎన్ఈపి మార్గదర్శకాలకు అనుగుణంగా సిలబస్ డిజైన్ చేయబడిందన్నారు. విద్యార్థుల ప్రత్యేక ఆసక్తులకు అనుగుణంగా ఎలెక్టీవ్ సబ్జెక్టులను ఎన్నుకునే అవకాశం ఉందన్నారు. డాక్యుమెంటరీ, షార్ట్ ఫిలిం మేకింగ్, ఆర్ట్ అఫ్ ఫిలిం డైరెక్షన్, క్రియేటివ్ రైటింగ్, స్క్రీన్ రైటింగ్, స్టోరీ బోర్డింగ్, సినిమాటోగ్రఫీ, ఫిలిం గ్రామర్, ఫిలిం హిస్టరీ, టీవీ మరియు ఫిలిం జర్నలిజం, ఫిలిం అప్రిసియేషన్, న్యూస్ రీడింగ్, యాంకరింగ్ వంటి అనేక అంశాలను ఈ కోర్సుద్వారా శిక్షణ పొందవచ్చని తెలిపారు. ఏదైనా డిగ్రీ పూర్తి చేసిన వారు అర్హులని, వయపరిమితి లేదని తెలిపారు. 30 సీట్లు అందుబాటులో ఉన్నాయని, అదనపు సమాచారం కోసం www.anu.ac.in లేదా 9393110848 ఫోన్ నంబర్ ద్వారా సంప్రదించాలని మధుబాబు సూచించారు.

బాణసంచా వ్యాపారంపై వాన దెబ్బ

(మొదటి పేజీ తరువాయి)

కాపాడుకున్నారు. గుంటూరులోని గుంట గ్రౌండ్‌తో పాటు బిషప్ మైదానంతో పాటువివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన దుకాణాలకు బాగా ఇబ్బంది ఏర్పడింది.

ఇదిలా ఉండగా దీపావళి బాణసంచా ధరలు భారీగా పెరిగాయి. ఒక్కో ఇంటికి కనీసం రూ.వెయ్యి ఖర్చు చేసినా కనీస టపాసులు రావడంలేదని కొనుగోలు దారులు వాపోతున్నారు. దీంతో సామాన్యులు టపాసులు కొనుగోలు చేయలేని పరిస్థితి నెలకొంది. పిల్లల సరదా కోసం కొంత మంది కొనుగోలుకు ముందుకు వచ్చినా ధరల పెరుగుదలతో ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వ ఉద్యోగులు, వ్యాపారులు, ధనికుల పిల్లలు ఎక్కువగా కొనుగోలు చేస్తుండగా పేద మధ్యతరగతి వారు మమ అనిపిస్తున్నారు. దీపావళి బాణసంచా విక్రయదారుల నుంచి వివిధ శాఖల అధికారులు ఉచితంగా టపాసులు తీసుకువెళ్లడంతో పాటు లైసెన్సు మంజూరుకు పెద్ద ఎత్తున ముడుపులు తీసుకుంటున్నారనే విమర్శలున్నాయి. టపాసులపై ఉండే కనీస చిల్లర ధరకు విక్రయ ధరకు పొంతన ఉండటం లేదు. ప్రధానంగా ఎంఆర్‌పిపై 60 శాతం వరకు తగ్గింపు ఇస్తున్నట్టు కన్పిస్తున్నా వీటిల్లోనే అధిక ధరలు ఉన్నట్టు వినియోగదారులు చెబుతున్నారు.

ఓటిటిలో డబల్ హార్స్ ఉత్పత్తుల ప్రచారంలో బాలకృష్ణ

ఓటీటీలో తెనాలి డబుల్ హార్స్ ఉత్పత్తుల సందడి

ప్రజాశక్తి - తెనాలి

'అన్ స్టాపబుల్ సీజన్ ఫోర్... కో ప్రెసెంటెడ్ బై తెనాలి డబుల్ హార్స్.. ఈరోజు నుంచి బాలయ్య పండగ మొదలైంది.. పండుగంటే స్వీట్ ఉండాలా లేదా..ఉండాలా లేదా.. తెనాలి డబుల్ హార్స్ 'రిషిక సున్నుండలు' నా తరఫు నుంచి అభిమానులకు ఇవ్వండి.. తెనాలి డబుల్ హార్స్.. రుచికరంగా ఉంటుంది అనుబంధాన్ని పెంచుతుంది' అంటూ ఓటిటి వేదికగా తెనాలి డబుల్ హార్స్ ఉత్పత్తుల ప్రచారం హోరెత్తిస్తోంది. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రాచుర్యం పొందిన తెనాలి డబల్‌హార్స్ ఉత్పత్తులు దీపావళి సందర్భంగా 'అన్ స్టాపబుల్' అంటూ ఓటిటి వేదికగా ప్రముఖ సినీ హీరో నందమూరి బాలకృష్ణ యాంకరింగ్‌లో తెనాలి డబల్ హార్స్ ఉత్పత్తుల ప్రచారం ఆహార ప్రియులకు నోరూరించే రీతిలో ఆకట్టుకుంటుంది.

బీసీల సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి-గుంటూరు : బిసిల సమస్యలపై ఆంధ్రప్రదేశ్ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు కేసన శంకరరావు, ఇతర నాయకులు బుధవారం బిసి సంక్షేమ శాఖ మంత్రి యస్.సవితను కలిసి వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలో చట్టబద్ధంగా జనగణనలో సమగ్ర కులగణన జరిపి, అన్ని స్థాయిల ప్రభుత్వ కార్యాలయాల నోటీసు బోర్డులలో ప్రదర్శించాలని, ఎన్నికల హామీ మేరకు చట్టసభలలో 33 శాతం, స్థానిక సంస్థలలో 34 శాతం బిసిల రిజర్వేషన్ పునరుద్ధరించాలని, ఎస్సీ, ఎస్టీల వలె బిసిలకు ప్రత్యేక రక్షణ చట్టం చేసి, వెంటనే అమలు పరచాలని కోరారు. ఔత్సాహిక బిసి పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించేలా వారికి శిక్షణ ఇప్పించటం తోపాటు, ఆర్థికాభివృద్ధికి తోడ్పడేలా విధాన నిర్ణయం చేయాలని, ఎస్సీ, ఎస్టీలకు వలె బిసి బ్యాక్‌లాగ్ పోస్టులను గుర్తించి, వాటిని వెంటనే భర్తీ చేయాలని విజ్ఞప్తి చేశారు. మార్కెట్ యార్డులు, దేవాలయాలు, విశ్వవిద్యాలయాలు, పలు కార్పొరేషన్లలో బిసిలకు 50 శాతం నామినేటెడ్ పోస్టులు కేటాయించాలన్నారు. ప్రతి జిల్లాలో రెండెకరాల స్థలం కేటాయించి, అందులో రూ.వంద కోట్లతో బిసి భవనాల నిర్మాణం మొత్తం 26 జిల్లాల్లో చేపట్టాలని కోరారు. అనంతరం సిఎంచంద్రబాబును కలిసి వరద బాధితుల సహాయార్థం రూ.10 లక్షల విరాళం అందజేశారు.

ఏఈ నాగవేణికి షోకాజు నోటీసు

ప్రజాశక్తి-గుంటూరు

ప్రజల అర్జీలు, ఫిర్యాదుల పరిష్కారంపై అధికారులు భాధ్యతగా ఉండాలని, నిర్లక్ష్యంగా ఉండేవారిపై చర్యలు తప్పవని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. ఏటి అగ్రహారంలో స్థానికులు తమ సమస్యల పై అందించిన అర్జీ పరిష్కారంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఏఈ నాగవేణికి షోకాజ్‌నోటీసుని నగర కమిషనర్ జారీ చేశారు. ప్రజలు సదరు ఆర్జీలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి, స్థానికంగా పరిష్కారం చేయగలిగితే తక్షణం చేయాలని, ఆర్థిక అంశాలతో కూడిన సమస్య అయితే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. అర్జీలను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు.

2 నుండి అమరావతి రోడ్డులో ఆక్రమణలు తొలగింపు

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక అమరావతి రోడ్ లాడ్జి సెంటర్ నుండి హెూసన్నా మందిరం వరకు రోడ్లు, డ్రైన్లమీద ఆక్రమణలను స్వచ్ఛందంగా తొలగించుకోవాలని, నవంబర్ 2వ తేదీ నుండి అమరావతి రోడ్డుకు ఇరువైపులా నగరపాలక సంస్థ సిబ్బంది ఆక్రమణలను పూర్తిగా తొలగించడానికి కార్యాచరణ సిద్ధం చేశామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.రోడ్లు, డ్రైన్లు ఆక్రమించి వివిధ వ్యాపారాలు చేసుకుంటూ ట్రాఫిక్‌కు, డ్రైన్లు మురునీటి పారుదలకు అడ్డంకిగా మారిందన్నారు. కావున ఆక్రమణలు స్వచ్ఛందంగా తొలగించుకోవాలన్నారు.

నాగులేరులో గుర్తుతెలియని మృతదేహం

ప్రజాశక్తి - దాచేపల్లి

నగర పంచాయతీ పరిధిలోని శివాలయం వెనుక భాగాన నాగులేరులో మృతదేహాన్ని చూసి స్థానిక పోలీస్ స్టేషన్ కి సమాచారాన్ని అందించారు. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ సుందర రాజన్ సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. గుర్తు పట్టడానికి వీలు లేకుండా ఉందని తెలిపారు. కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని గురజాల ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీకి తరలించారు.

జానకిదేవికి మన్నెం దంపతుల అభినందనలు

ప్రజాశక్తి - మంగళగిరి

తిరుమల తిరుపతి దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యురాలుగా నూతనంగా నియమితులైన టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి శ్రీమతి తమ్మిశెట్టి జానకి దేవిని బుధవారం రాత్రి మార్కెట్ యార్డ్ మాజీ వైస్ ఛైర్మన్ మన్నెం రమేష్ బాబు, శ్రీమతి అనిత దంపతులు కలిసి అభినందించారు. ఈ సందర్భంగా మన్నెం దంపతులు జానకిదేవి హరికృష్ణ దంపతులను శాలువాతో సత్కరించి బోకే అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ జానకి దేవి టిడిపి కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ పార్టీ అభివృద్ధికి విశేషంగా కృషి చేశారని, ఆమె చేసిన కృషిని గుర్తించి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర మంత్రి వర్యులు నారా లోకేష్ టీటీడీ ధర్మకర్తగా నామినేట్ చేయటం అభినందనీయమని అన్నారు.

పోలీసు అమరులకు నివాళిగా క్యాండిల్స్ ర్యాలీ

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

పోలీస్ అమరవీరులకు నివాళులు అర్పిస్తూ బుధవారం రాత్రి స్థానిక నగరంపాలెంలో పోలీసులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని ఎస్‌పి సతీష్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్‌పి అమరవీరుల స్థూపం వద్ద క్యాండిల్స్ వెలిగించారు. పుష్ప గుచ్ఛాలు ఉంచి నివాళి అర్పించారు. పోలీసు అమరవీరుల సేవలను, త్యాగాలను కొనియాడుతూ జోహార్ - పోలీస్ అమరవీరులకు - జోహార్ అంటూ నినాదాలు చేశారు. ఎస్‌పి మాట్లాడుతూ ప్రజల రక్షణ కోసం పలువురు అధికారులు ప్రాణ త్యాగం చేశారని తెలిపారు. పోలీసుల త్యాగం మరువ లేనిదన్నారు. అదనపు ఎస్పీలు రమణమూర్తి, హను మంతు, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

ర్యాలీలో పాల్గొన్న ఎస్‌పి సతీష్‌కుమార్, అధికారులు

తుళ్లూరులో

ప్రజాశక్తి - తుళ్లూరు

పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని తుళ్లూరు సిఐ గంగా వెంకటేశ్వర్లు అన్నారు.బుధవారం రాత్రి రాజధాని అమరావతి పరిధిలోని తుళ్లూరులో పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం ముగింపును పురస్కరించుకుని పోలీసులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. అమరులైన పోలీసుల జీవితాలను ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగుతున్నామని పోలీసులు పేర్కొన్నారు. ర్యాలీలో పోలీసులతో పాటు స్థానికులు పాల్గొన్నారు.

మేడికొండూరులో

ప్రజాశక్తి- మేడికొండూరు

పోలీసు అమరవీరుల దినోత్సవ వారోత్సవం సందర్భంగా అమరవీరులకు పేరేచర్ల జంక్షన్లో బుధవారం రాత్రి శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో మేడి కొండూరు సిఐ నాగుర్ మీరా సాహెబ్, ఎస్ఐ ఖాజీ బాబు, ఎస్ఐ డేవిడ్, ఏఎస్ఐ రాజు, సిబ్బంది, ప్రజలు క్యాండిల్ ర్యాలీని నిర్వహించారు.

BEFORE THE VII ASSISTANT CITY CIVIL COURT AT CHENNAI
O.S. No. 8164 OF 2022

KEYARAM DEVELOPERS &
KEYARAM HOTELS Pvt Ltd
Rep. by its Director K. Sandrasegaran
Chennai-600031.
...Plaintiff

Versus

M/s. PVP Corporate Parks Pvt Ltd.,
Rep. by its Director V.R.Arasu,
and 12 others
...Defendants

To,
Mrs. Zakirunnisa Begum, W/o. Azizul Rahaman Khan, D.No.4-20-45/A 4th Line Siddartha Nagar, Guntur - 522 007, Andhra Pradesh.
5th Defendant

Please take notice that the above civil suit is posted on 14.11.2024 for your appearance before the Hon'ble VII Assistant City Civil Court, Chennai. Please also take notice that you are requested to appear before the said court on **14.11.2024 at 10.30 AM** and state your objections if any, failing which the above matter will be heard and decided in your absence.

// By Order //

M/s. N. Manikandan
S. Vaitheeswari
D. Kalpana
S. Varun Ganesh Samiappa
Counsels for Plaintiff

మహారాజశ్రీ అద్దంకి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో

O.S.No : 372/2023

కట్లగుంట విజయలక్ష్మీ .....వాది

Vs

మునిపల్లె పోతురాజు & ఇతరులు ..... ప్రతివాదులు

ప్రకటన.

టు: ప్రతివాదులు 4 & 5

1. మునిపల్లె వెంకటరత్నం W/o లేటు సాంబయ్య (D-4) R/o. D. No: 5-25, గార్లపాడు (గ్రామం), పెదనందిపాడు (మండలం,) గుంటూరు (జిల్లా.)
2. మునిపల్లె భూలక్ష్మి W/o లేటు సత్యనారాయణ (D-5) R/o. D.No : 3-48, లాం జొన్నలగడ్డ (గ్రామం), గుంటూరు రూరల్ (మండలం), గుంటూరు జిల్లా.

వాది మీ పై దాఖలు చేసిన పై నెంబరు దావా లో మీకు ఎన్నిసార్లు నోటీసులు పంపినప్పటికి మీరు దురుద్దేశ్యపూర్వకముగా తీసుకొనక తిరిగి పంపుచున్నందువలన మీకు ప్రకటన ద్వారా కోర్టువారు జారీ చేసి మీ హాజరు నిమిత్తం ఈ దావాను తేది. 12-11-2024 నకు వాయిదా వేశారు. కావున మీరు ఆ తేదిన ఉదయం గం.10-30 ని.లకు పై కోర్టువారి ఏదుట స్వయముగాగాని వకీలు ద్వారా గాని హాజరై పై దావా లో మీ ఆక్షేపణలను తెలియ జేయవలేను. లేని ఏడల పై దావాను మీ పరోక్ష మందు తీర్మానించదరని తెలియజేయడమయినది.

// శ్రీ కోర్టువారి ఉత్తర్వులతో //

వజ్రాల అంజిరెడ్డి
మారం శ్రీనివాసరావు,
తాడికొండ ప్రసాద్ బాబు.
వాది తరుపు న్యాయవాదులు,
అద్దంకి

విజేతలకు బహుమతులు ప్రదానం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

పోలీస్ అమరవీరుల సంస్మరణోత్సవాలను పురస్కరించుకుని ఇటీవల నిర్వహించిన వ్యాస రచన వక్తృత్వ పోటీల్లో విజయం సాధించిన వారికి జిల్లా ఎస్‌పి సతీష్ కుమార్ బుధవారం సాయంత్రం బహుమతులు అందచేశారు. జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పోలీస్ శాఖకు మరియు పోలీస్ శాఖేతర విద్యార్థినీ, విద్యార్థులకు 18 మందికి బహుమతులు ప్రదానం చేశారు. సైబర్ నేరాల నివారణలో యువత పాత్ర, నేటి సమాజంలో పోలీసులు ఎదుర్కొంటున్న సవాళ్లుఅనే అంశాలపై రెండు విభాగాలలో ఒక్కో విభాగానికి 9 మంది చొప్పున మొత్తం 18 మందిని విజేతలుగా ఎంపిక చేశారు. వీరిలో ప్రభుత్వ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. వట్టిచెరకూరు జెడ్‌పి హైస్కూలుకు చెందిన కె. అంజలి, పెదకాకానికి చెందిన ఎ.కరుణకరరావు, ఎస్.కె.సతీయా భాను ప్రథమ స్థాయిలో బహుమతులుపొందారు. అదనపు ఎస్‌పి రమణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరిస్తున్న నక్కా ఆనందబాబు

9న మేడ్ రాష్ట్ర మహాసభ

ప్రజాశక్తి-గుంటూరు

మోడల్ అసోసియేషన్ ఆఫ్ దళిత్ ఎంప్లాయిస్ (మేడ్) రాష్ట్ర 7వ మహాసభను జయప్రదం చేయాలని వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు కోరారు. బుధవారం గుంటూరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మహాసభల పోస్టర్‌ను మేడ్ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. అలాగే జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా జెడ్పీ కార్యాలయంలో పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మేడ్ రాష్ట్ర అధ్యక్షులు మురికిపూడి దేవపాల్ మాట్లాడుతూ 2017లో స్థాపించిన సంఘం దళిత ఉద్యోగుల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తుందని చెప్పారు. మహాసభలు నవంబర్ 9న గుంటూరు ఏసీ కాలేజిలోని, జెడి శీలం హాల్‌లో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. దళిత ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మేడ్ నాయకులు పెరకలపూడి రమేష్, కట్టేపోగు పున్నారావు, డేగల రత్నరాజు, పారి షాలేంరాజు తదితరులు పాల్గొన్నారు.

జనరల్ నోటీసు

IN THE COURT OF THE HON'BLE ADDL. SENIOR CIVIL JUDGE::TENALI
I.P.No.38/2024

Between:-
Janganam Murali S/o Siva Rama Murthy, Tenali. ...Petitioner
To
R1: Sukavasi Ravichand, S/o Seshagiri Rao, Tenali
R2: Rachapudi Abhinay, S/o Mariyadasu, Burripalem ...Respondents

పై నెంబరు ఐ.పి.లో పిటీషనరు తనను ఇన్‌సాల్వెంట్‌గా డిక్లేర్ చేయమని కోరుచూ పిటీషను దాఖలు చేయగా, సదరు పిటిషనుపై ఎరికైనా అభ్యంతరములు వుంటే తెలుపుకోమని శ్రీకోర్టువారు జనరల్ నోటీసుకు ఆర్డరు వేస్తూ మీ హాజరు నిమిత్తము ది.8-11-2024వ తేదీకి వాయిదా వేసి యున్నారు. సదరు వాయిదా రోజు ఉదయం 10-30 ని॥లకు మీరు స్వయంగా గాని, మీ తరపు న్యాయవాది ద్వారా గాని శ్రీ కోర్టు వారి యెదుట హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల సదరు పిటీషన్‌ను మీ పరోక్షమున విచారించి, తీర్మానించబడునని యావన్మందికి తెలియచేయడమైనది.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వులతో)

వాయిదా:8-11-2024

జె.ఆదినారాయణ్,
పిటీషనర్ తరపు అడ్వకేట్,
తెనాలి, సెల్ నెం.85550 26628.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి : ఎమ్మెల్యే నసీర్

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు తూర్పు నియోజకవర్గంలో పారిశుధ్య పనులపై ప్రత్యేకదష్టి సారించాలని నియోజకవర్గ ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ అన్నారు. బుధవారం గుంటూరు తూర్పు నియోజకవర్గంలో పారిశుధ్య పనులపై సిఎంఒహెచ్, ఎంహెచ్ఓ, ప్రజారోగ్య అధికారులతో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈసందర్భంగా ఎమ్మెల్యే తొలుత నియోజకవర్గ పరిధిలో శానిటరీ డివిజన్లు, కార్మికులు, సెక్రెటరీలు, ఇన్‌స్పెక్టర్లు, చెత్త తరలింపు వాహనాలు తదితర వివరాలు అడిగి తెలుసుకొని మాట్లాడుతూ తూర్పు నియోజకవర్గంలో పారిశుధ్య పనుల్లో మార్పు రావాలని, కార్మికులతో పాటు పర్యవేక్షణ అధికారుల పనితీరులో కూడా మార్పు రావాలన్నారు. ఇంటింటి చెత్తసేకరణ నూరు శాతం జరగాలన్నారు. ప్రతి సచివాలయం పరిధిలో రోజూ కొంత మంది స్థానికుల సంతకాలు, అభిప్రాయాలు తీసుకోవాలన్నారు. సచివాలయం పరిధిలో ప్రధాన ప్రాంతాల్లో ఆ వీధి కార్మికులు, సెక్రెటరి, ఇన్స్పెక్టర్ల పేర్లు, ఫోన్ నంబర్లతో బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. ఖాళీ స్థల యజమానులకు నోటీసులు అందించి, శుభ్రం చేసుకోవాలని తెలియచేయాలన్నారు. రోడ్లపై ఆవులు వదలకుండా ముందుగా యజమానులకు నోటీసులు ఇవ్వాలని, అప్పటికీ రోడ్ల మీదకు వదిలితే సీజ్ చేసి జిఎంసి గోశాలకు తరలించాలన్నారు. తూర్పు నియోజకవర్గంలో మెరుగైన పారిశుధ్య సాధనకు ప్రతి ఒక్కరూ అంకిత భావంతో కషి చేయాలని, అందుకు ప్రజా ప్రతినిధుల నుండి సంపూర్ణ సహకారం అందిస్తామని తెలిపారు.సమావేశంలో సిఎంఒహెచ్ డాక్టర్ శోభారాణి, ఎంహెచ్ఓ డాక్టర్ రవిబాబు, బయాలజిస్ట్ మధుసూదన్, ఏఎంహెచ్ఓ రాంబాబు, ఎస్ఎస్ ఆయుబ్ ఖాన్, శానిటరీ ఇన్స్పెక్టర్లు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నసీర్

పేలుతున్న టపాసుల ధరలు

ప్రజాశక్తి - చిలకలూరిపేట

దీపావళి టపాసుల ధరలు గతేడాదితో పోలిస్తే 30-40 శాతం పెరిగి పేలిపోతున్నాయి. కొంచెం పెద్దవనుకునే టపాసులు ఏది కొందామన్నా రూ.150-200కు తక్కువగా ఉండడం లేదు. అగ్గిపెట్టె నుంచి తౌజండ్ వాల వరకు ధరలన్నీ పెరిగాయి. రవాణా, దుకాణం అద్దెలు, కెమికల్స్ ధరలు పెరుగుదల, జీఎస్టీ వంటివన్నీ పెరగడం ప్రస్తుత ధరలకు కారణమని వ్యాపారులంటున్నారు. హోల్‌సేల్ దుకాణాల నుండి తెచ్చిన బాణసంచాను లైసెన్స్ పొందినవారితోపాటు ఇతర దుకాణదార్లు కూడా బాణసంచా విక్రయిస్తుంటారు. సరుకు చేతులు మారేకొద్దీ ధరలూ పెరుగుతుంటాయి. హోల్‌సేల్ వ్యాపారుల వద్దే అధిక ధరలు ఉండడంతో వినియోగదారుని వద్దకు వచ్చేసరికి మరింతగా ధరలుంటున్నాయి.

పిల్లలు ఎక్కువగా కాల్చే సాదా బాక్సులు కంపెనీవి గతంలో రూ.80-150 ఉండగా ఇప్పుడు రూ.120-200 వరకున్నాయి. చిచ్చుబుడ్లు చిన్నవి 10 ఉండే ప్యాకెట్ పేరున్న కంపెనీవి రూ.300 వరకు పలుకుతున్నాయి. వీటితోపాటు తారాజువ్వలు, కాకరపువ్వొత్తులు, లక్ష్మిబాంబులు, ఇతర టపాసులు కుటుంబానికి సరిపడా కొనడానికి గతంలో రూ.1000-1500 ఖర్చయితే ఇప్పుడు రూ.3 వేలు దాటుతున్నాయి. అయితే పిల్లల సంతోషం కోసం ఆర్థిక భారమైనా కొనక తప్పడం లేదని వినియోగదారులు నిట్టూరుస్తున్నారు.

సాగర్‌రోడ్డులో ఏర్పాటు చేసిన తాత్కాలిక దుకాణాలు

పట్టణ శివారుకు బాణసంచా దుకాణాలు

19 షాపులకు తాత్కాలిక అనుమతులు

ప్రజాశక్తి - మాచర్ల

దీపావళి సందర్భంగా గతంలో పట్టణంలో అమ్మకాలు జరిపిన తాత్కాలిక దుకాణాలు ఈ ఏడాది పట్టణ శివారుకు తరలివెళ్లాయి. గతంలో ఇద్దరు ముగ్గురికే విక్రయ అనుమతులిచ్చి వారు పట్టణంలోనే అమ్ముకునే అవకాశం కల్పించారు. దీంతో అధిక ధరలకు అమ్మేవారు. ప్రస్తుతం 19 మందికి తాత్కాలిక విక్రయ అనుమతులివ్వగా లైసెన్సు ద్వారా రూ.2 లక్షలు ఆదాయం ప్రభుత్వానికి సమకూరింది. లైసెన్సు పొందిన వారు పట్టణ శివారు సాగర్ రోడ్డులో షాపులను ఏర్పాటు చేసుకున్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు నిర్వహిస్తున్న ఏడీఏ

ఎరువుల కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్ : ఎరువులు కృత్రిమ కొరత సృష్టించే వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటామని సత్తెనపల్లి ఇన్‌ఛార్జి ఎడిఎ ఎస్.శ్రీధర్‌రెడ్డి హెచ్చరించారు. సత్తెనపల్లి పట్టణంలో ఎరువులు, పురుగు మందుల దుకాణాలను వ్యవసాయ అధికారులు బుధవారం తనిఖీ చేశారు. ఎరువులు కొనుగోలు చేసిన రైతులకు తప్పని సరిగా బిల్లు ఇవ్వాలని ఆదేశించారు. దుకాణాల ముందు స్టాక్ బోర్డుపై ఎరువుల నిల్వలు నమోదు చేయాలన్నారు. అధిక ధరలకు విక్రయించే డీలర్ల లైసెన్స్‌ను రద్దు చేస్తామన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఏవో ఆర్.రామారావు

బయోమెట్రిక్ ద్వారానే ఎరువులు అమ్మాలి

ప్రజాశక్తి-ఈపూరు : ఎరువులు అమ్మే సమయంలో ప్రతి రైతు బయోమెట్రిక్ వేసి అమ్మకాలు జరపాలని ఏవో ఆర్.రామారావు చెప్పారు. మండలంలోని ఎరువులు, విత్తనాలు, పురుగుమందుల దుకాణాల నిర్వాహకులతో స్థానిక వ్యవసాయ కార్యాలయంలో బుధవారం సమావేశమయ్యారు. నిబంధనలకు వ్యతిరేకంగా అమ్మకాలు, కొనుగోలు జరిపితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కొనుగోలు జరిపే ప్రతి రైతుకు కచ్చితంగా బిల్లులు ఇవ్వాలన్నారు.

ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు దీపావళి శుభాకాంక్షలు

ప్రజాశక్తి - దాచేపల్లి : గురజాల నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు శుభాకాంక్షలు తెలిపారు. టపాసులు కాల్చేటప్పుడు ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, వేడుకలు సురక్షితంగా చేసుకోవాలని సూచించారు.

రెండో వారం నుండి హాస్టళ్లలో తనిఖీ : పల్నాడు కలెక్టర్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలో ప్రభుత్వం నిర్దేశించిన మెనూ తప్పనిసరిగా అమలు చేయాలని, నిబంధనలు అతిక్రమించిన వారిపై క్రమశిక్షణ, క్రిమినల్ చర్యలు తీసుకుంటామని పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు హెచ్చరించారు. సాంఘిక, వెనుబడిన తరగతుల, గిరిజన సంక్షేమ హాస్టళ్ల నిర్వహణపై వార్డెన్లు, ప్రిన్సిపాళ్లతో కలెక్టర్ బుధవారం సమీక్షించారు. నరసరావుపేటలోని కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్షలో కలెక్టర్ మాట్లాడుతూ మరుగుదొడ్ల నిర్వహణ సక్రమంగా ఉండాలని, నిరంతర నీటి సరఫరా, పరిశుభ్రత, ఫ్యాన్లు వెలుతురు ఉండేలా లైటింగ్ ఉండాలని చెప్పారు. విద్యార్థులతో పనులు చేయించొద్దన్నారు. బాలికల హాస్టళ్లకు ప్రహరీ, ఫెన్సింగ్ తప్పనిసరిగా ఉండానలి ఆదేశించారు. నైట్ వాచ్‌మెన్‌లు ఉండాలన్నారు. వచ్చేనెల 2వ వారం నుండి హాస్టళ్లను తనిఖీ చేస్తామని చెప్పారు. సమీక్షలో సాంఘిక సంక్షేమ శాఖాధికారి ఓబుల నాయుడు, వెనుక బడిన తరగతుల అధికారి నాగేశ్వరరావు, గిరిజన సంక్షేమ శాఖాధికారి వరలక్ష్మి, సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాల జిల్లా సమన్వయాధికారి పద్మజ పాల్గొన్నారు.

వానకు విరిగి పడ్డ 120 ఏళ్లనాటి భారీ చెట్టు

ప్రజాశక్తి - సత్తెనపల్లి టౌన్

సుమారు 120 ఏళ్ల నాటి భారీ చింతచెట్టు బుధవారం వర్షానికి విరిగిపడింది. నిత్యం రద్దీగా ఉండే ఆ ప్రాంతంలో చెట్టు విరిగే సందర్భంలో ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదమే తప్పిందని అందరూ ఊపిరి పీల్చుకున్నారు. మున్సిపల్ సిబ్బంది చెట్టును తొలగించే పనుల్లో నిమగ్నమయ్యారు.

పెదకూరపాడు లో భారీ వాన

ప్రజాశక్తి - పెదకూరపాడు

నియోజకవర్గ కేంద్రమైన పెదకూరపాడులో బుధవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. పగలంగా ఆకాశం మేఘావృతమై ఉండడంతోపాటు సాయంత్రం ఉరుములు మెరుపులతో చిరుజల్లులతో వాన ప్రారంభమైంది. అనంతరం గంటకు పైగా భారీ వానతో మండలంలోని వాగులు వంకలు ఉధృతంగా ప్రవహించాయి. పత్తికాయలు పగిలిన ఈ దశలో వాన పంటకు నష్టం చేస్తుందని రైతులు ఆందోళనగా ఉన్నారు. కళ్లాల్లో ఆరబోసి ఉన్న సోయాబీన్ పంట సైతం దెబ్బతినే అవకాశం ఉంది.

విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల్ని రెగ్యులరైజ్ చేయాలి

ప్రజాశక్తి-చిలకలూరిపేట

విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల్ని రెగ్యులర్ చేయాలని, పెండింగ్లో ఉన్న సమస్యల్ని వెంటనే పరిష్కరించాలని సిఐటియు పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.ఆంజనేయులు నాయక్ డిమాండ్ చేశారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో ఎలక్ట్రిసిటీ కాంటాక్ట్ వర్కర్స్ యూనియన్-హెచ్ 176 (సిఐటియు) సమావేశం బుధవారం నిర్వహించగా ఆంజనేయులు నాయక్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తెచ్చిన విద్యుత్ సంస్కరణ బిల్లును వెంటనే ఉపసంహరించుకోవాలని, విద్యుత్ రంగా ప్రవేటికరణ ఆపాలని కోరారు. ఈ సమస్యలపై చర్చించేందుకు 16, 17 తేదీల్లో గుంటూరులో నిర్వహించే వర్క్‌షాప్‌ను జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో యూనియన్ అధ్యక్షులు జె.రాజశేఖర్, ఎవి.నాగేశ్వరరావు, ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు.

గీతాంజలి స్కూల్స్‌లో దీపావళి వేడుకలు

ప్రజాశక్తి - వినుకొండ : స్థానిక గీతాంజలి స్కూల్‌లో వేడుకలు నిర్వహించగా ప్రిన్సిపాల్ టి.కృష్ణవేణి ముఖ్య అతిథిగా మాట్లాడారు. పెద్దల సమక్షంలోనే టపాసులు కాల్చాలని, తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా చిన్నారులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. కరెస్పాండెంట్ వైఎల్ కిషోర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పర్యావరణహిత దీపావళిపై ఎంఎం రెడ్డి ఇంజనీరింగ్ ఆధ్వర్యంలో ర్యాలీ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

సురక్షిత మరియు పర్యావరణహిత దీపావళి కోసం నరసరావుపేట మండలం పెట్లూరివారిపాలెంలోని ఎఎం.రెడ్డి ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు నరసరావుపేట పట్టణంలోని మల్లమ్మ సెంటర్ నుండి బస్టాండ్ వరకు బుధవారం అవగాహన ర్యాలీని నిర్వహించారు. కళాశాల సెక్రటరీ అట్లూరి శాంతి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ టపాసులు కాల్చేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కాలుష్యం రహిత వేడుకలు అందరి బాధ్యతన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్. మల్లికార్జున్, డిప్లొమా ప్రిన్సిపాల్ డాక్టర్ కె.కృష్ణారెడ్డి మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడడం ద్వారా భవిష్యత్తు తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణం అందిద్దామన్నారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు రొంపిచర్ల విద్యార్థులు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

మండల కేంద్రమైన రొంపిచర్ల జెడ్పి పాఠశాల విద్యార్థులు అండర్-17 రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం బిఎం.సుభాని బుధవారం తెలిపారు. గుంటూరు జిల్లా తాడికొండ మండలం రావెల జెడ్పి పాఠశాలలో జరిగిన ఉమ్మడి గుంటూరు జిల్లా బాలికల విభాగంలో బి.బాలకృష్ణ, బాలుర విభాగంలో కె.చిత్ర దీపిక రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారని అన్నారు. 25న అనంతపురంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు ఉమ్మడి గుంటూరు జిల్లాజట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని చెప్పారు. వీరిని హెచ్ఎంతోపాటు పిఇటి సైదయ్య, పేరెంట్స్ కమిటీ ఛైర్మన్ ఏడుకొండలు అభినందించారు.

గీతమ్స్‌లో ఘనంగా దీపావళి వేడుకలు

ప్రజాశక్తి - వినుకొండ : స్థానిక గీతమ్స్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్లో బుధవారం ముందస్తు దీపావళి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా గీతమ్స్ విద్యాసంస్థల కరస్పాండెంట్ మాలపాటి కోటిరెడ్డి హాజరై విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపి దీపావళి నేపథ్యాన్ని వివరించారు. ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దీపావళి టపాసుల వ్యాపారులకు వాన దెబ్బ

ఉండవల్లి దేముడి మాన్యంలో దుకాణాలు

ప్రజాశక్తి-తాడేపల్లి

ఈ సంవత్సరం దీపావళి టపాసులు వ్యాపారులకు వాన దెబ్బ తగిలింది. తాడేపల్లి, రాజధానిలో భాగమైన ఉండవల్లికి సంబంధించి, ఉండవల్లి దేవుడు మాన్యంలో అధికారులు ఈ సంవత్సరం దీపావళి టపాసుల అమ్మకాలకు అనుమతులు మంజూరు చేశారు. బుధవారం మధ్యాహ్నం నుండి ఎడతెరిపి లేకుండా వర్షం పడటంతో, టపాసులు అమ్మకాలు ఏర్పాటు చేసిన దేవుడు మాన్యం నీటితో నిండిపోయింది. టెంట్లు కుప్పకూలి పోయాయి. మందు గుండు సామాగ్రి తడిసి పాడైపోయింది. ఒకే రోజు జరిగే ఈ వ్యాపారానికి లక్షలాది రూపాయలు అధిక వడ్డీలతో పాటు, కాల్ మనీ గూడ డబ్బులు తీసుకొచ్చి వ్యాపారాలు మొదలుపెట్టినట్టు టపాసులు విక్రయదారులు చెబుతున్నారు. అనుకోకుండా వచ్చిన వాని దెబ్బ కు తాము లక్షల్లో నష్టపోవాల్సి వస్తుందని వాపోతున్నారు. టపాసుల విక్రయాలకు మరో 18 గంటలు మాత్రమే సమయం ఉండటంతో సరుకు అమ్ముడు పోక వ్యాపారుల కంట కన్నీరు వలుకుతుంది. రాత్రి 7 గంటల సమయానికి కూడా వర్షం ఆగిపోవటంతో దిక్కుతోచని స్థితిలో దీపావళి టపాసులు ఉన్నారు. వేరేచోట విక్రయాలు జరుపుకోవటానికైనా తమకు అనుమతి ఇవ్వాలని అధికారులను వేడుకుం టున్నారు. వర్షం ఇలాగే కొనసాగితే లక్షలాది రూపాయల సరుకు నీళ్ల పాలో అవుతుందని ఆందోళన చెందుతున్నారు. అధికారులు వెంటనే తగు నిర్ణయం తీసుకొని తమను దీపావళి టపాసుల నష్టాల నుండి ఒడ్డు నెయ్యాలని వ్యాపా రులు కోరుతున్నారు.

ప్రజాశక్తి -తాడేపల్లి రూరల్

అందరూ కలిసి ఉత్సాహంగా జరుపుకునే దీపావళి పండుగ వాతావరణం బుధవారం కురిసిన అకాల వర్షానికి , యం టి ఎం సి పరిధిలోని వివిధ గ్రామాలలో టపాసుల వ్యాపారుల గుండెల్లో లక్ష్మీ బాంబును పేల్చింది. లక్షలాది రూపాయలు పెట్టు బడులు పెట్టీ, మందు గుండు సామాన్లు తెచ్చి , రోడ్ల పై దుకాణాలు పెట్టుకున్న వ్యాపారులు ఒక్కసారిగా అకాల వర్షం కురవడం తో బెంబేలు చెందారు. తమ టపాసుల దుకాణాలను పరదాలతో మందు గుండు సామాన్లు తడవకుండా నానా తంటాలు పడాల్సిన పరిస్థితి ఏర్పడిందని పలువురు వ్యాపారస్తులు వాపోయారు.

అప్రమత్తతతోనే క్యాన్సర్ నివారణ

ప్రజాశక్తి-గుంటూరు

క్యాన్సర్‌ను తొలి దశలో కనుగొనటం ద్వారా నూరుశాతం నివారణ సాధ్యమని ప్రభుత్వాసుపత్రి నాట్కో క్యాన్సర్ సెంటర్ మెడికల్ ఆంకాలజీ హెచ్‌ఓడి డాక్టర్ టివి శివరామకృష్ణ అన్నారు. స్థానిక సాంబశివపేట ప్రభుత్వ మహిళా కళాశాలలో సుజయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళా సాధికారత సెల్ సహకారంతో మహిళల్లో క్యాన్సర్ వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. డాక్టర్ శివరామకృష్ణ మాట్లాడుతూ ఎన్ని కోట్లు, ఎంత హోదా ఉన్నా ఆరోగ్యం లేకపోతే జీవితం దుర్లభం అవుతుందని చెప్పారు. 3500 ఏళ్ల క్రితమే క్యాన్సర్ కనుగొనబడిందని, ప్రతి 19సెకండ్లకు ఒకరు క్యాన్సర్ బారిన పడుతున్నారని, దేశంలో ఇప్పటికే 25 లక్షల మంది క్యాన్సర్ పీడితులు ఉన్నారని, ప్రతి ఏడాది 8లక్షలు చొప్పున క్యాన్సర్ బారిన పడటం 5 లక్షల మంది చనిపోవడం ఆందోళన కలిగించే విషయం అన్నారు. రకరకాల స్థాయిలో క్యాన్సర్ రోగులకు ట్రీట్మెంట్ ఉంటుందని కోలుకున్న అనంతరం నిరంతరం వైద్యుల పర్యవేక్షణలో పూర్తి స్వస్థత పొందవచ్చని తెలియజేశారు. సర్జికల్ ఆంకాలజీ ప్రొఫెసర్ డాక్టర్ ఏ. జాహ్నవి మాట్లాడుతూ మహిళలు గర్భసంచి, బ్రెస్ట్‌క్యాన్సర్లకు గురవుతారని చెప్పారు. మహిళల్లో ఈస్ట్రోజన్ ఎక్కువ విడుదల అవటం, 40,45 సంవత్సరాల తర్వాత మోనోపాజ్ ఆగిపోవడం, బ్రెస్ట్‌పై గడ్డలు, చనుమొనల నుండి ద్రవాలు, రక్తం కారటం గమనించినట్లయితే వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. దగ్గరి బంధువులలో ఈవ్యాధి ఉండటం, 50 ఏళ్లు దాటిన వారికి బహిష్టు ఆగిపోవడం, పిల్లలు కలగకపోవడం, లేటు మ్యారేజెస్ ద్వారా కలిగే సంతానం తర్వాత మద్యపానం, ధూమపానం సేవించడం ఆహారంలో ఎక్కువ కొవ్వు పదార్థాలు తీసుకోవడం, అధిక బరువు వంటి కారణాలతో క్యాన్సర్ వచ్చే అవకాశాలు ఉంటాయన్నారు. జిజిహెచ్‌లోని నాట్కో క్యాన్సర్ సెంటర్‌లో క్యాన్సర్‌కు సంబంధించి అన్ని రకాల పరీక్షలు, ఆపరేషన్లు, మందులు, ఉచితంగా అందచేస్తారని అధ్యాపకులు, విద్యార్థినిలు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో సుజయ ఫౌండేషన్ నిర్వాహకులు డాక్టర్ జ్యోతుల మురళీకృష్ణ ప్రసంగించారు.సభకు ప్రిన్సిపల్ డాక్టర్ వి.ఆర్ జోత్స్నకుమారి అధ్యక్షత వహించగా డాక్టర్ ఎన్.మురళి, డాక్టర్ అంకారెడ్డి, డాక్టర్ డాలిన్, వినయ్, ప్రోగ్రాం కోఆర్డినేటర్ పరుచూరి విజయలక్ష్మి, భవాని, ధాత్రి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డాక్టర్ శివరామకృష్ణ

ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి

ఎమ్మెల్యే గళ్లా మాధవి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

పశ్చిమ నియోజకవర్గంలో ఎప్పటి నుండో తిష్టవేసి ఉన్న ప్రజాసమస్యలు తన దృష్టికి వస్తున్నాయని, వీటి పరిష్కారానికి తప్పక కృషి చేస్తానని ఎమ్మెల్యే గళ్ళా మాధవి హామినిచ్చారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ప్రజల నుండి మాధవి అర్జీలు స్వీకరించారు. అనేక చోట్ల శివారు కాలనీల్లో సరి అయిన రోడ్లు, డ్రయినేజి వ్యవస్థలు లేవని తమ సమస్యను పరిష్కరించాలని పలువురు మహిళలు కోరారు. కొత్త పెన్షన్‌లు ఇవ్వాలని కొందరు, తొలగించిన పెన్షన్లను పునరుద్ధరించాలని మరికొందరు కోరగా త్వరలోనే ప్రభుత్వం నుండి మార్గ దర్శకాలు రాబోతున్నాయని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికి లబ్ది చేకూర్చే బాధ్యత తమ ప్రభుత్వం తీసుకుంటుందని మాధవి హామీనిచ్చారు. "మీ తోనే - మీ వెంటే' కార్యక్రమం ద్వారా క్షేత్ర స్థాయిలో నేరుగా సమస్యల గుర్తిస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. వచ్చిన అర్జీలలో కొన్నిటిని అక్కడికక్కడే పరిష్కరించగా, కొన్నిటిని సత్వరమే పరిష్కరించాలని అధికారులకు ఎమ్మెల్యే ఆదేశాలు జారీచేశారు.

వివాలో జర్మన్ విద్యార్థులు, అధ్యాపక బృందం పర్యటన

ప్రజాశక్తి - తెనాలి

వివా ద స్కూల్ నంబూరులో జర్మన్ విద్యార్థులు, అధ్యాపక బృందం పర్యటించింది. జర్మనీ దేశంలోని న్యూరెంబర్గ్ నగరానికి చెందిన ఓ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ డాక్టర్ బెర్నార్డ్ ఆధ్వర్యంలో డ్యూరర్, మార్టిన్ బెహం పాఠశాలకు చెందిన 13 మంది విద్యార్థులు, ఆరుగురు అధ్యాపకులతో కూడిన బృందం మేక్ థాన్ 2024 భాగంగా వివా పాఠశాలను సందర్శించింది. మూడు విభాగాలుగా జరిగే కార్యక్రమంలో మొదటి దశ అంతర్జా లంలో నిర్వహించగా, రెండవ దశలో వివా విద్యార్థులు జర్మనీలో జరిగిన మేక్థాన్‌లో పాల్గొన్నారు. మూడవ దశలో జర్మన్ విద్యార్థులు వివా పాఠశాలలో జరిగుతున్న మేక్థాన్ లో పాల్గొన్నారు. వచ్చే నెల రెండో తేదీ వరకు జర్మనీ విద్యార్థులు అధ్యాపక బృందం వివాలోనే వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటుందని ప్రిన్సిపల్ చదలవాడ సరళ చెప్పారు. విద్యార్థులలో సాంకేతిక, సాంస్కృతిక పరిజ్ఞానం, పరిశాలనా దృష్టి, ఆలోచన విధానంలో మార్పు కొరకు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి కళ్ళు లేని వారు రహదారులపై కూడా నడిచే విధంగా అప్రమత్తం చేసే చేతి కర్ర, ఎకో మోషన్ షూస్, నాడీ వేగాన్ని అదుపులో ఉంచే సైకిల్ పెడల్ వంటివి తయారు చేయనున్నారు. విద్యార్థులు సంస్కృతులను అర్థం చేసుకొని వాటిని గౌరవించడం ద్వారా మెరుగైన సమాజాన్ని రూపొందించాలన్న దృక్పథంతో నిర్వహించిన 'ఏకమ్' కార్యక్రమంలో జర్మన్ విద్యార్థులు పాల్గొన్నారు. ఆరు దేశాలు, ఆరు రాష్ట్రాల సంస్కృతి, సంప్రదాయాలు, వేషధారణ, ప్రముఖుల జీవిత విశేషాలను ఈ వేదిక ద్వారా వివా విద్యార్థులు వివరించారు. జర్మన్ మహిళా అధ్యాపకులు సైతం సంప్రదాయ చీరకట్టులో పాల్గొనడం విశేషం. కార్యక్రమంలో డైరెక్టర్ లెఫ్టినెంట్ కమాండర్ కె శ్రీనివాసరావు, ఐబి ప్రోగ్రాం హెడ్ కె మాధవి విద్యార్థులు పాల్గొన్నారు.

వివా విద్యార్థులతో జర్మన్ బృందం

వివా ఆవరణలో సందడి చేస్తున్న జర్మన్ విద్యార్థులు అధ్యాపకులు

వాహనాలను పరిశీలిస్తున్న కమిషనర్

వెహికిల్ షెడ్‌ను సందర్శించిన కమిషనర్

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగరపాలక సంస్థ వెహికిల్ షెడ్‌ని సమగ్ర సర్వే చేసి, కాంపౌండ్ వాల్ నిర్మాణం చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. బుధవారం కమిషనర్ స్థానిక కెవిపి కాలనీలోని జిఎంసి వెహికిల్‌షెడ్, విద్యానగర్ 3లైన్‌ను పరిశీలించి చేపట్టాల్సిన పనులపై అధికారులకు తగు ఆదేశాలు జారీచేశారు. ఈసందర్భంగా కమిషనర్ తొలుత వెహికిల్ షెడ్‌ని పరిశీలించి, షెడ్ పరిసరాలను పూర్తిగా సర్వేచేసి, బౌండరీ ఫిక్స్‌చేసి, చుట్టూ కాంపౌండ్‌వాల్ నిర్మాణం చేపట్టాలన్నారు. షెడ్‌లో ఫ్లోరింగ్ చేయాలన్నారు. అనంతరం వాహనాల పనితీరును సమీక్షించి, ప్రతివాహనం రన్నింగ్‌లో ఉండాలని, మరమ్మతులు 24 గంటల్లో పూర్తి చేయాలన్నారు. నూతన స్వీపింగ్ యంత్రాలను ప్రాంతాల వారీగా మ్యాపింగ్‌చేసి, ప్రజారోగ్య అధికారులకు కేటాయించాలన్నారు. ఈ-ఆటోలను ఏజన్సీ ప్రతినిధులతో సమన్వయం చేసుకొని పూర్తి స్థాయిలో రన్నింగ్‌లోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు.షెడ్ పరిసరాల్లో ఏర్పాటు చేసిన ప్లాస్టిక్ వ్యర్థాల నుండి ఆయిల్ తయారీ యూనిట్‌ని వినియోగంలోకి తీసుకు వచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. వెహికిల్ షెడ్‌లో కాలపరిమితి ముగిసిన వాహనాలను స్క్రాప్ చేయడానికి ఆర్టీఓ అధికారులతో సమన్వయం చేసుకోవాలన్నారు. అనంతరం విద్యా నగర్ 3వ లైన్ పరిశీలించి నూతనంగా రోడ్ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్దం చేశామన్నారు.స్థానిక పార్క్‌లో పిల్లల ఆట వస్తువులు, ట్రాక్ మరమ్మతులు, పచ్చదనం పెంపుకు ప్రతిపాదనలు వెంటనే తమకు అందించాలని ఏఈని ఆదేశించారు. పర్యటనలో అదనపు కమిషనర్ సిహెచ్.ఓబులేసు, కార్పొరేటర్ కె.కోటేశ్వరావు, డిసిపి సూరజ్ కుమార్, ఈఈ సుందర్రామిరెడ్డి పాల్గొన్నారు.

నిరసన తెలియచేస్తున్న వివిధ సంఘాల నాయకులు

ఈవీఎంల కుట్రను నిగ్గు తేల్చాలి

ప్రజాశక్తి-గుంటూరు

గత పది సంవత్సరాలుగా బిజెపి ప్రభుత్వం ఈవీఎంలను అడ్డం పెట్టుకొని గెలవడంతోపాటు, ఎలక్షన్ కమిషన్ కూడా మద్దతు పలుకుతుందని భారతీయ పార్టీల మూడవ కూటమి రాష్ట్ర అధ్యక్షులు ఇంజినీర్ బోరుగ రత్నం అన్నారు. స్థానిక అంబేద్కర్ కూడలి వద్ద భారత్ బంద్‌లో భాగంగా వివిధ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఈవీఎంలకు వ్యతిరేక ధర్నాను నిర్వహించారు. ఈ సందర్భంగా రత్నం మాట్లాడుతూ ఎలక్షన్ కమిషన్ సేకరించిన 60 లక్షల ఈవీఎంలలో కేవలం 40 లక్షలు మాత్రమే ఆయా సందర్భాలలో వాడుతున్నారని మిగిలిన 20 లక్షల ఈవీఎంలు ఎక్కడ ఎలా ఉన్నాయి అన్నదానికి ఎలక్షన్ కమిషన్ నుండి సమాధానం రావట్లేదని విమర్శించారు. భీమ్‌సేన సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షులు నల్లపు నీలాంబరం మాట్లాడుతూ ప్రధాని మోడీ సారధ్యంలోని ఎన్డీఏ ప్రభుత్వం ఎలక్షన్ కమిషన్, న్యాయస్థానాలలో పాటు అన్ని వ్యవస్థలలో ఆర్ఎస్ఎస్ ఎజెండా అమలు చేసే వ్యక్తులను ఉన్నత స్థానాలలో పదవులు కట్టబెట్టడం నియంతత్వానికి దారితీస్తుందన్నారు. రాష్ట్రంలో ఇటీవల ఎన్నికల్లో ఈవీఎంల మాయాజాలంతోనే కూటమి గెలిచిందన్నారు.కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు దొడ్డ రవీంద్ర, జయకుమార్, సాదు మాల్యాద్రి, తాటికొండ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి దీపావళి శుభాకాంక్షలు

ప్రజాశక్తి- వెల్దుర్తి

మాచర్ల నియోజకవర్గ ప్రజలందరికీ ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. బాణసంచా కాల్చే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని, పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు.

కార్తీక మాసం ఏర్పాట్లపై సమీక్ష

ప్రజాశక్తి - అమరావతి

కార్తీక మాసం నేపథ్యంలో స్థానిక అమరేశ్వరాలయంలో చేపట్టాల్సిన ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో ఆలయ ఈవో కె.సునీల్ కుమార్ బుధవారం సమావేశమయ్యారు. వాహనాలు అధికంగా వచ్చే అవకాశ ఉన్న దృష్ట్యా ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చూడాలని, నదిలో స్నానాలు ఆచరించే సందర్భంలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్‌శాఖ పర్యవేక్షించాలని చెప్పారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా, పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా చూడాలని కోరారు. సిఐ శ్రీనివాసరావు, తహశీల్దార్ శివనాగమల్లేశ్వరరావు, ఎంపిడిఒ పార్వతి పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ఎమ్మెల్యేల శంకుస్థాపన

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

రాజీవ్ గాంధీ కూరగాయల మార్కెట్ అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ బుధవారం శంకుస్థాపన చేశారు. రూ.38.50 లక్షలతో దక్షిణం, తూర్పు వైపు కాంపౌండ్ వాల్, మార్కెట్ వద్ద ఫ్లాట్ ఫామ్, స్టెయిన్ లెస్ స్టీల్ రెయిలింగ్, రూఫింగ్ పనులను ప్రారంభించారు. మున్సిపల్ చైర్మన్ చల్లంచర్ల లక్ష్మి తులసీ, కమిషనర్ కె.షమీ నాయకులు వై.రామస్వామి, సిహెచ్.శ్రీనివాసరావు, ఎ.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - నాదెండ్ల

మండలంలోని అమీన్‌సాహెబ్‌పాలెం, బుక్కాపురంలో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు బుధవారం శంకుస్థాపన చేశారు. రూ.10 లక్షలతో సీసీ రహదారులు, డ్రెయిన్ల పనులను ప్రారంభించారు. ఎంపిపి టి.రాణి, జనసేన నాయకులు టి.రాజారమేష్, టిడిపి నాయకులు బి.సత్యనారాయణ, జి.నాగు పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - బెల్లంకొండ : మండలంలోని నాగిరెడ్డిపాలేనికి చెందిన బి.నాగరాజ రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా అంత్య క్రియల నిమిత్తం మృతుని కుటుంబానికి రూ.5 వేలను టిడిపి నాయకులు టి.కిచారెడ్డి బుధవారం అందించారు. బి.వీరారెడ్డి, వి.వెంకటరెడ్డి, బి.వెంకటరెడ్డి, టి.సత్యనారాయణ తదితరులు నివాళులర్పించారు.

ప్లాను కోసం డబ్బులు డిమాండ్

- చిలకలూరిపేట పట్టణ ప్రణాళిక విభాగంపై కౌన్సిలర్ ఆరోపణ
- సమస్యలపై ధ్వజమెత్తిన సభ్యులు

ప్రజాశక్తి-చిలకలూరిపేట

మున్సిపల్ చైర్మన్ షేక్ రఫానీ అధ్యక్షతన బుధవారం నిర్వహించిన కౌన్సిల్ సమావేశంలో పలువురు సభ్యులు ప్రజా సమస్యలపై ధ్వజమెత్తారు. పట్టణ ప్రణాళిక విభాగంలో అవినీతి జరుగుతోందని టిడిపి కౌన్సిలర్ శివకుమారి విమర్శించారు. ప్లాను కావాలంటే అధిక మొత్తంలో డబ్బులు డిమాండ్ చేస్తారన్నారని ఆరోపించారు. మరోవైపు ప్లానుకు విరుద్ధంగా నిర్మాణాలు జరుగుతున్నాయని, కాల్వలను సైతం అతిక్రమిస్తున్నారని చెప్పారు. కమిషనర్ పి.శ్రీహరిబాబు సమాధానమిస్తూ తాను బాధ్యతలు స్వీకరించిన తరువాత పట్టణ ప్రణాళిక విభాగ వెబ్‌సైట్ నిలిచిపోయిందని, ఒక్క ప్లాను కూడా మంజూరు చేయలేదని అన్నారు. అవినీతిపై ఫిర్యాదులిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ప్లాన్లకు విరుద్ధంగా నిర్మాణాల విషయం తన దృష్టికి వచ్చిందని, చర్యలు తీసుకుంటామని చెప్పారు. పదో వార్డు కౌన్సిలర్ బేరింగ్

మౌలాలి మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థల సాయంతో బస్‌స్టాప్‌లు ఏర్పాటు చేద్దామన్నారు. వైసిపి కౌన్సిలర్ వి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పట్టణానికి చెందిన మురుగు గణపవరాన్ని ముంచెత్తడంపై తన ఫిర్యాదును పట్టించుకోవడం లేదన్నారు. డీఈఈ రహీం సమాధానమిస్తూ సమస్య శాశ్వత పరిష్కారానికి రోడ్డుకు ఇరువైపులా కాల్వల నిర్మాణం చేయటానికి ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. వైసిపి కౌన్సిలర్ వడితే కోట్యానాయక్ మాట్లాడుతూ తమ వార్డు పరిధిలో లీకుల సమస్య తీవ్రంగా ఉందన్నారు. కుక్కల బెడదనూ ప్రస్తావించారు. తాగునీరు, జ్వరాలు, తదితర సమస్యలనూ కౌన్సిలర్లు ప్రస్తావించారు.

చిలకలూరిపేట కౌన్సిల్ సమావేశంలో పాల్గొన్న సభ్యులు.. మాట్లాడుతున్న చైర్‌పర్సన్ రఫాని

పలువురు కౌన్సిలర్లు సైతం ప్రస్తావించారు. జనసేన కౌన్సిలర్ ఆర్.సుమన్ మాట్లాడుతూ అమరావతి బస్టాండ్ వద్ద కొందరు స్థలాలను ఆక్రమించగా మరికొందరు వాటిని అద్దెకూ ఇస్తున్నారని చెప్పారు.

ఆక్రమణలను తొలగించండి

ప్రజాశక్తి - సత్తెనపల్లి టౌన్

పట్టణంలో ఆక్రమణలు ఎక్కడున్నా వెంటనే తొలగించాలని మున్సిపల్ కమిషనర్ కె.షమీని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ఆదేశించారు. చైర్‌పర్సన్ లక్ష్మీతులసి సాంబశివరావు అధ్యక్షతన బుధవారం నిర్వహించిన కౌన్సిల్ సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ మురుగు కాల్వలపై అక్రమణలను వెంటనే తొలిగించాలన్నారు. ఇదే అంశంపై

బోర్ల మరమ్మతుకు నిర్ణయం

ప్రజాశక్తి - దాచేపల్లి

బోర్ల మరమ్మతుకు, పలువురు కార్మికులను నియమించేందుకు నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశం నిర్ణయించింది. బుధవారం జరిగిన కౌన్సిల్ సమావేశానికి చైర్‌పర్సన్ కె.సుబ్బమ్మ సాంబయ్య అధ్యక్షత వహించగా ఇండిపెండెంట్ కౌన్సిలర్ షేక్ షరీఫ్ మాట్లాడుతూ ఇటీవల డయేరియా ప్రబలిన అంజనాపురం కాలనీ వాసులకు రక్షిత నీటి సరఫరా కోసం రూ.25 కేటాయిస్తూ ఎమ్మెల్యే ప్రకటించడంపై కృతజ్ఞతలు తెలిపారు. పరిస్థితి మరింత తీవ్రతరం కాకుండా కృషి చేసిన కమిషనర్ అప్పారావు, పారిశుధ్య కార్మికులు, ఆరోగ్య సిబ్బందికి ధన్యవాదాలు చెప్పారు.

పత్తిలో గులాబి రంగు పురుగు నివారణ ఇలా..

పత్తి పొలాలను పరిశీలిస్తున్న ఎడిఎ పి.మస్తానమ్మ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

గులాబి రంగు పురుగు నివారణ ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని ఎడిఎ పి.మస్తానమ్మ రైతులకు సూచించారు. నరసరావుపేట మండలం గోనేపూడిలో బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. పత్తి పొలాలను ఎడిఎ పరిశీలించి గులాబి రంగు పురుగు ఉధృతిని గుర్తించారు. గులాబీ పురుగు సోకిన పొలంలో మొగ్గలు తెరుచుకోకపోవడం, కాయలు రాలిపోవడం, పత్తి పాడవ్వడం, విత్తన నష్టానికి కారణమవుతుందని చెప్పారు. తద్వారా బరువు తగ్గే అవకాశం ఉందన్నారు. కాయ కుళ్లు ఫంగస్ వంటి అవకాశవాద సూక్ష్మ జీవులు లార్వా చేసిన ప్రవేశం లేదా నిష్క్రమణ రంధ్రాల ద్వారా కాయలకు సోకుతాయన్నారు. పురుగు నివారణపై వివరించారు. గుడ్డు దశలో ప్రభావం చూపే ప్రొఫినోఫాస్ 50 ఇసి 2 మిల్లీ లీటర్లు లేదా డయోడికార్బ్ 75 డబ్ల్యు.పి, 1.5 గ్రాములు లేదా క్వినాల్ ఫాస్ 25 ఇసి 2.5 మిల్లీ లీటర్లు లేదా క్లోరి ఫైరిఫాస్ 20 ఇసి, 2.5 మిల్లీ లీటర్లు/ లీటర్ నీటికి కలిపి 10 రోజుల వ్యవధిలో రెండు మూడు సార్లు మందులను మార్చిమార్చి పిచికారి చేస్తే లార్వా కాయలోనికి ప్రవేశించకుండానే నివారించుకోవచ్చన్నారు. పంట చివరి దశలో ఉంటే సింథటిక్ పైరీత్రాయిడ్స్ మందులైన సైపర్ మెత్రిన్ 25 ఇసి, 1 మిల్లీ లీటర్లు లేదా లామ్డా సైహాలోత్రిన్ 5.0శాతం ఇసి, ఒక మిల్లీ లీటరును లీటర్ నీటికి కలిపి పిచ్చికారి చేయాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వి.నరేంద్రబాబు, గ్రామ వ్యవసాయ సహాయకులు వినయ్ పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చేస్తే రెండేళ్ల జైలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

బాల్యవివాహాలు, అక్రమ దత్తత అరికట్టేందుకు అధికారులు కృషి చేయాలని నరసరావుపేట దిశ సిఐ సుభాషిణి అన్నారు. నరసరావుపేట పట్టణం చంద్రబాబునాయుడు కాలనీ కమ్యూనిటీ హాల్‌లో జిల్లా బాలల పరిరక్షణ ఆధ్వర్యంలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. బాల్య వివాహాలు నిరోధక చట్టం-2006పై వివరించారు. బాల్యవివాహాలు చేసినవారికి రెండేళ్ల జైలు, రూ.లక్ష జరిమానా విధిస్తామన్నారు. చట్ట విరుద్ధంగా ఎవరికైనా పెంచుకునే పేరుతో పిల్లల్ని ఇచ్చినా, తీసుకున్నా మూడేళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తామన్నారు.

అవగాహన కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న అధికారులు

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో సిడిపిఒ ఉమా మహేశ్వరి, పిఒఐసి కృష్ణారెడ్డి, ఒఎస్‌సి సెంట్రల్ అడ్మినిస్ట్రేటర్ రాజ్యలక్ష్మి, సోషల్ వర్కర్ శైలజ, ఐసిడిఎస్ సూపర్వైజర్ గౌసియా, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

జ్వరాలపై ఇంటింటి సర్వే

ప్రజాశక్తి - మాచర్ల

విష జ్వరాలు ప్రబలకుండా పారిశుధ్య పనులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సచివాలయ శానిటరీ కార్యదర్శులను మున్సిపల్ కమిషనర్ డి.వేణుబాబు ఆదేశించారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో కమిషనర్ మాట్లాడుతూ ఎఎన్ఎంలు ఇంటింటి సర్వే చేపట్టి విష జ్వరాలు వచ్చిన వారిని గుర్తించాలన్నారు. విష జ్వరాలు వచ్చిన వారి ఇళ్లవద్ద ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. మున్సిపాలిటీ నుండి సరఫరా చేసే వాటర్ నుండి శాంపిల్స్ తీయాలని, పైపులైను లీకేజీలు లేకుండా చూడాలని చెప్పారు. గ్యాంగ్ వర్క్ నిర్వహించి మురుగు తోలగించేందుకు కార్యాచరణను రూపొందించామన్నారు.

శ్రీరామప్ప దేవాలయంలో మాసశివరాత్రి వేడుకలు

ప్రజాశక్తి - మాచర్ల రూరల్ : మాసశివరాత్రిని పురస్కరించుకొని స్థానిక శ్రీ రామప్పదేవాలయంలో బుధవారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. అన్న ప్రసాదాలను పంపిణి చేశారు. కార్యక్రమాల్లో కె.యల్లమంద, టి.సత్యనారాయణ, టి.అంకేశ్వరరావు, పి.చంద్రశేఖరరావు, లింగేశ్వరరావు, ఎస్.వెంకటరత్నం, వి.మంగమ్మ, వి.వెంకటేశ్వర్లు, ఒ.మంత్రయ్య, కె.మాధవరావు, డి.రామారావు, కె.సుబ్రమణ్యం, కుమారి, ఒ.మురళి, వాసు, వి.ఉషారాణి పాల్గొన్నారు.

కల్లర్ కులస్తుల సమస్యలను పరిష్కరిస్తాం

ప్రజాశక్తి-చిలకలూరిపేట

స్థానిక కళామందిర్ సెంటర్‌లో పిరమలై కల్లర్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఉక్కిరపాండి ముత్తురామలింగం తేవర్ జయంతి, వర్ధంతిని బుధవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు మాట్లాడుతూ సంస్కరణవాదిగా, సామాజిక విప్లవాల చుక్కానిగా దేశం చరిత్రలో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని ముత్తురామలింగం కలిగి ఉన్నారని చెప్పారు. రైతు, కార్మికోద్యమాల నాయకుడిగా, దళిత, బహుజన వర్గాల ఉద్యమాలకు మార్గదర్శిగా, ధ్యాత్మిక వేత్తగా ప్రసిద్ధి గాంచారని అన్నారు. రాష్ట్రంలో లక్షకుపైగా పిరమలై కల్లర్ సామాజిక తరగతి వారున్నారని, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. స్థానికంగా 50 కుటుంబాలు ఉండగా వారు మూడు అంశాలను తన దృష్టికి తెచ్చారని, కుల ధ్రువపత్రాలు అందించేలా చూస్తామని, బీసీ జాబితాలో చేర్చేలా కృషి చేస్తామని, చదువులకు ప్రభుత్వ సాయం అందిస్తామని అన్నారు.

విద్యార్థినులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - క్రోసూరు

వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని క్రోసురు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ధనుష్ అన్నారు. కస్తూరిబా బాలికల విద్యాలయాన్ని బుధవారం సందర్శించిన ఆయన బాలికలకు ఆరోగ్యాంశాలపై అవగాహన కల్పించి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఏమైనా ఇబ్బందికర లక్షణాలుంటే తక్షణమే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సేవలు ఉపయోగించుకోవాలని సూచించారు. ప్రినిసపాల్ ఇందిరా ప్రియదర్శిని, సాంబశివరావు, శాంసన్, హైమావతి, చంద్రిక, పావని, లక్ష్మి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి నెట్ బాల్, రగ్బీ పోటీలకు ఎంపికైన తెనాలి విద్యార్థులు

రాష్ట్రస్థాయి పోటీలకు తెనాలి విద్యార్థులు

ప్రజాశక్తి-తెనాలిరూరల్

అక్టోబర్ 30న చిలకలూరిపేట ఎఎంజి ఉన్నత పాఠశాలలో నిర్వహించిన నెట్ బాల్ పోటీలలో తెనాలి శ్రీ రావి సాంబయ్య పురపాలక పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు షేక్ మౌలాబీ బుధవారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. అండర్-14 బాలుర విభాగంలో పమిడి గణేష్, బాలికల విభాగంలో పి సత్యవాణి, అండర్ 17 బాలుర విభాగంలో ఎడ్ల తరుణ్, బాలికల విభాగంలో పాలపర్తి హేమంబద్ర, లక్ష్మీప్రసన్న ఎంపికయినట్లు చెప్పారు. నూతక్కి జడ్పీ హైస్కూల్‌లో జరిగిన రగ్బీ పోటీలలో అండర్ 17 బాలుర విభాగంలో షేక్ బుజ్జి ఎంపికైనట్లు తెలియజేశారు. పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు ప్రసాద కుమారి, కొడాలి గోవర్ధన పాఠశాల ఉపాధ్యాయులు ఎంపికైన విద్యార్థులను అభినందించారు.

కాలువలో పూడిక తీసి ఎన్నాళ్లయిందో....?

సొంత ఖర్చులతో సమస్యను పరిష్కరించిన టిడిపి నాయకులు

ప్రజాశక్తి-తాడేపల్లి

తాడేపల్లి పట్టణంలోని 17 వార్డులో రైలు కట్ట సమీపంలో ఉన్న ఇళ్ల మధ్య ఉన్న డ్రైనేజీ కాలువ పూడిక తీసి ఎన్నాళ్ళయిందో అని స్థానిక ప్రజలు పెదవిరుస్తున్నారు. నెలల తరబడి కాలువ పూడిక తీయక పోవడంతో చిట్టడుగుని తలపించేలా పెద్ద ఎత్తున ముళ్లకంప పెరిగి కాలవ ఆనవాలే కనిపించకుండా పోయింది. ఫలితంగా భరించలేని దుర్వాసనతో తాము ఇళ్లల్లో ఉండలేక పోతున్నామని స్థానికులు వాపోతున్నారు. తమ ప్రభుత్వం అధికారంలో ఉంది, చెప్పగానే పనులు ఇట్టే జరిగిపోతాయి అని భావించి, తెలుగు తమ్ముళ్లతో పాటు స్థానికులు కూడా భావించారు. ఆ మేరకు అనేకసార్లు ఆయా కార్యాలయంలో విజ్ఞప్తులు కూడా చేశారు. అయినా పట్టించుకోలేదు. సమస్య పరిష్కారానికి నోచుకోలేదు. అధికారుల దృష్టికి తీసుకెళ్తే సమస్య పరిష్కారం అవుతుందని భావించి ఆ దిశగా కూడా ప్రయత్నం చేశారు. అయినా ఎక్కడ వేసిన గొంగళిఅక్కడే అన్న చం దా గా పరిస్థితిలో ఎటువంటి మార్పు రాలేదని బాధితులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. దీర్ఘకాలంగా పూడిక తీకపోవటంతో పెద్ద ఎత్తున మురుగు నిలబడి దోమలు స్వైర విహారం చేస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. డెంగీ లాంటి వైరల్ ఫీవర్ వస్తే ఏమని భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. సమస్య ఎవరూ పట్టించుకోరని అర్థం కావడంతో స్థానిక తెలుగు యువత నాయకులు వద్దని బుధవారం తన సొంత ఖర్చులతో ప్రోక్లైన్ తెప్పించి కాలువ పూడికతీత పనులు పూర్తిచేయించారు. దీర్ఘకాలంగా ఉన్న తమ సమస్య పరిష్కారం కావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జగ్జీవన్‌రామ్ బయోపిక్‌లో నటించనున్న ఆరుగురు ఎమ్మెల్యేలు

ప్రజాశక్తి-తెనాలిరూరల్

వైద్య వృత్తిలో కొనసాగుతున్న డాక్టర్ చందోలు నాగ మల్లేశ్వర రావు నిర్మిస్తున్న జగజ్జీవన్ రామ్ బయోపిక్ లో రాష్ట్రానికి చెందిన ఆరుగురు శాసన సభ్యులు నటిస్తున్నట్లు చిత్ర దర్శకుడు దిలీప్ రాజా తెలిపారు. తెనాలి 'మా-ఏపీ' కార్యాల యంలో బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నవంబరు 9 నుంచి తెనాలిలో షూటింగ్ కొనసాగుతుందన్నారు. స్వాతంత్రోద్యమంలో జగజ్జీవన్ రామ్ రెండు పర్యాయాలు బ్రిటిష్ చెరసాలకు వెళ్లిన సన్నివేశాలను తెనాలిలో చిత్రీకరిస్తున్నట్లు ఆయన తెలిపారు. చిత్రంలో భగత్ సింగ్ పాత్రలో ప్రత్తిపాడు ఎమ్మెల్యే రామాంజనేయులు, చంద్రశేఖర్ ఆజాద్ పాత్రలో పార్వతీపురం ఎమ్మెల్యే విజయ్ చంద్ర, బ్రిటీష్ గవర్నర్ జనరల్ గా చింతలపూడి ఎమ్మెల్యే రోషన్ కుమార్, ఎమ్మెల్యేలు వర్ల కుమార్ రాజా, దస్తగిరి, జయసూర్య వివిధ పాత్రలు పోషిస్తున్నారని దర్శకుడు దిలీప్ రాజా తెలిపారు. వంద ఏళ్ల క్రితం జరిగిన యదార్థ సంఘటనలను చిత్రీకరించడానికి నిర్మాణ వ్యయం ఎక్కువ అయిందని అన్నారు. టైటిల్ పాత్రలో మిలటరీ ప్రసాద్, లోక్‌సభ మాజీ స్పీకర్ మీరాకుమార్ పాత్రలో సీనియర్ నటి తాళ్లూరి రామేశ్వరి, కన్నడ నటుడు మర్కాలి, జీవ, నరసింహ రాజు, అన్నపూర్ణ, కావ్య కీర్తి, దివిజ, పద్మిని, రజియ, ఎర్రబాబు, భాను, హరిబాబు తదితరులు నటవర్గమని దర్శకుడు దిలీప్ రాజా తెలిపారు. కాగా ఇప్పటికే జగజ్జీవన్ రామ్ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్‌ను ఆంధ్రప్రదేశ్ సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ ఆవిష్కరించగా రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్య ప్రసాద్, ఎమ్మార్పీస్ నేత మందా కృష్ణ మాదిగ, రాజ్యసభ మాజీ సభ్యులు మోపిదేవి వెంకట రమణ రావు, బీజేపీ నేత యడ్లపాటి రఘునాథ్ బాబు, ఎమ్మెల్యే నక్కా ఆనంద్ బాబు, మాజీమంత్రి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ లు పబ్లిసిటీ పోస్టర్‌ను పరిశీలించారని దర్శకుడు దిలీప్ రాజా చెప్పారు. పోస్ట్ ప్రొడక్షన్ అనంతరం 2025 లో సినిమాను తెలుగు, హిందీ, కన్నడ, మలయాళ భాషలలో ప్రపంచవ్యాప్తంగా విడుదల చేస్తున్నట్లు యూనిట్ కంట్రోలర్ ప్రదీప్ దోనేపూడి తెలిపారు. పెదరావూరు ఫిలిం స్టూడియో పతాకంపై చందోలు దేవదాసు సమర్పణలో ఎన్నారై డాక్టర్ నాగ మల్లేశ్వరరావు నిర్మాతగా తెనాలిలో రూపొందుతున్న జగజ్జీవన్ రామ్ చిత్రానికి కో-ఆర్డినేటర్ కాలేబ్ రాజు కాగా కథ, మాటలు, స్క్రీన్ ప్లే, దర్శకత్వం దిలీప్ రాజా వహించారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - దుగ్గిరాల

చలికాలంలో వచ్చే సీసనల్ వ్యాధులు, ఆస్తమా బారిన పడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఈమనీ పీహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ రహీమున్నీసా అన్నారు. ఫ్రెండ్లీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా బుధవారం మండల ంలోని వీర్ల పాలెం గ్రామంలో నిర్వహించిన వైద్య శిబిరంలో ఆమె వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేడి చేసి చల్లార్చిన నీరు తాగుతూ తప్పని సరిగా మాస్క్ ధరించాలన్నారు. అత్యవసర మైతే తప్ప మంచులో రావద్దని సలహానిచ్చారు. ప్రస్తుతం జ్వరాలు మాత్రమే ఉన్నాయని వారికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు ఇస్తున్నట్లు తెలిపారు.

ప్రొఫెసర్ స్వరూపరాణికి సన్మానం

ప్రజాశక్తి - ఏఎన్‌యు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ మహాత్మా జ్యోతిరావు పూలే అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య స్వరూపరాణి కి బుధవారం ఘన సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా పూలే అధ్యయన కేంద్రం సంచాలకులు ఆచార్య ఎం. త్రిమూర్తి రావు మాట్లాడుతూ ఆచార్య స్వరూపరాణి ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ గా భాద్యతలు స్వీకరించిన నాటినుండి నేటివరకు విద్యార్థులు, పరిశోధకులు, అధ్యాపకులకు అందు బాటులో ఉంటూ ఎటువంటి ఇబ్బందులు లేకుండా విధులు నిర్వహించారని, ఆర్ట్స్ కళాశాల అభివృద్ధికి తోడ్పడినట్లు పేర్కొన్నారు. పరిశోధక విద్యార్థులకు విశ్వవిద్యాలయ ఫెలోషిప్స్‌ని త్వరితగతిన అందచేసారని కొనియాడారు. కార్యక్రమంలో అధ్యయన కేంద్రం ప్రోగ్రామర్ బి. కోటియదవ్, వాసుదేవ్, స్కాలర్ వి. నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఫార్మర్ ఐడి కార్డులతో ప్రయోజనం

ప్రజాశక్తి - దుగ్గిరాల

సబ్సిడీపై రైతులకు యంత్ర పరికరాలు అందించమని వ్యవసాయ శాఖ అధికారులు అధికారికంగా ప్రభు త్వానికి లేఖలు రాశారని మండల వ్యవసాయ అధికారి పీ శిరీష అన్నారు. మండలంలోని పెదపాలెం గ్రామంలో బుధవారం నిర్వహించిన పొలం పిలుస్తుంది కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ తైవాన్ స్ప్రేయర్లు, ట్రాక్టర్లు వ్యవసాయ రంగానికి సంబంధించిన ఇతర యంత్ర సామాగ్రి రైతులకు సబ్సిడీపై అందించే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. డీప్ ఇరిగేషన్ ద్వారా పైరుకు నీరు అదిస్తే నీరు వృధా కావని, నాణ్యమైన ఎక్కువ

దిగుబడి వస్తుందని, డిఎ ఇరిగేషన్‌కు ప్రభుత్వం సబ్సిబీ ఇస్తుందని తెలిపారు. ప్రస్తుత సీజన్లో వరి పంట దిగుబడి కి తీసుకోవలసిన చర్యలను రైతులకు వివరించారు. త్వరలో రైతుల పొలాలకు గుర్తింపు కార్డులు ఇస్తారని తెలిపారు. ఫార్మర్ ఐడి పొలం ఐడి పేరుతో రైతుకు పొలానికి సంబంధించిన వివరాలు అందులో పొందుపరుస్తారని తెలిపారు. ఎరువులు పురుగు మందులు వ్యవసాయ రంగానికి సంబంధించిన పరికరాలు ఈ ఐడి కార్డు ద్వారానే పొందువలసి ఉంటుందన్నారు. ఈ కార్డు కలిగి ఉంటేనే వ్యవసాయ రంగానికి సంబంధించిన అన్ని పథకాలు వర్తిస్తాయని తెలిపారు. సర్పంచ్ పాటిబండ్ల కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ రైతులకు కావాల్సిన జింక్ జిప్సం ఖరీఫ్ ప్రారంభానికి ముందు జూన్ నెలలోనే ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ కుటుంబా క సాయి కృష్ణ ఏఈఓ రమేష్ బాబు వి ఏ లు రైతులు తదితరులు పాల్గొన్నారు.

సూపర్ స్టార్ విగ్రహం ఏర్పాటుకు వినతి

ప్రజాశక్తి - తెనాలి

పట్టణంలో ఏర్పాటు చేస్తున్న తెనాలి బండ్‌పై తెనాలి ప్రాంతానికే గుర్తింపు తెచ్చిన నటులు, సూపర్ స్టార్ కృష్ణ కాంస్య విగ్రహం ఏర్పాటు చేయాలని కోరుతూ రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌కు కృష్ణ అభిమానులు బుధవారం వినతిపత్రం సమర్పించారు. నియోజకవర్గంలోని బుర్రిపాలెం కృష్ణ స్వగ్రామని, ఆయన తనయుడు మహేష్ బాబు కూడా సినీ రంగంలో అనితర సాధ్యమైన విజయాలతో ముందుకు సాగుతున్నట్లు మంత్రికి వివరించారు. కృష్ణ విగ్రహం ఏర్పాటు ద్వారా ఆయనకు సముచిత గౌరవం లభించినట్లు అవుతుందని సూచించారు. కార్యక్రమంలో కృష్ణ, మహేష్ బాబు

మంత్రి మనోహర్‌కు వినతి పత్రం అందజేస్తున్న అభిమానులు

అభిమానులు ఈదర వెంకట పూర్ణ చంద్, కె యశ్వంత్ కుమార్, షేక్ షబ్బీర్ అఖిల్, షావుల్ సయ్యద్, సాయి, వెంకటేష్, కుర్రా రాకేష్, షేక్ సుభాని పాల్గొన్నారు.

పర్యావరణ హితంగా దీపావళి

ప్రజాశక్తి-తెనాలిరూరల్

పర్యావరణహితమైన దీపావళిని జరుపుకోవాలని వెస్ట్ బెర్రీ పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు 250 మంది తెనాలి బస్ స్టాండ్ నుండి చినరావూరు పార్క్ వరకు బుధవారం ర్యాలీ నిర్వహించారు. పటాసులు వద్దు-పర్యావరణం ముద్దు అని నినాదాలు చేస్తూ బాలబాలికలు నృత్యాలు చేస్తూ ర్యాలీ నిర్వహించి, ప్రజలకు అవగాహన కల్పించారు. బాణసంచా కాల్చడంవల్ల కలిగే ఆరోగ్య సమస్యలు, వాయు, ధ్వని కాలుష్యం వంటి ప్రభావాల గురించి వివరించారు. పర్యావరణానికి హాని కలగకుండా సేంద్రియ దీపాల ద్వారా, పూలదీపాలు వెలిగిస్తూ,

సాంప్రదాయ పద్ధతుల్లో దీపావళి పండుగను జరుపుకోవాలని సూచించారు. పాఠశాల ప్రిన్సిపాల్ టివి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ దీపావళి పండుగను జరుపుకోవడం ఆనవాయితీ అయినప్పటికీ పర్యావరణానికి హాని కలిగించకుండా జరుపు కోవడం అందరి బాధ్యత అన్నారు. కార్యక్రమంలో పాఠశాల కోఆర్డినేటర్స్ భాను ప్రియ, శశికళ, మత్యుంజయ తదితరులు పాల్గొన్నారు.

పుసులూరు గ్రామసభలో 66 అర్జీలు

ప్రజాశక్తి - పెదనందిపాడు

రీ సర్వేలో రైతులకు ఎదురైన భూ సమస్యల పరిష్కారం కోసం రెవెన్యూ గ్రామ సభలు నిర్వహించడం జరిగిందని మండల తహసీల్దార్ పి శంకర్ బాబు అన్నారు. మండల పరిధిలోని పుసులూరు రెవెన్యూ గ్రామసభని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రీ సర్వే సమస్యలపై రైతుల నుండి అర్జీలు స్వీకరించారు. పలువురు రైతులు వారి సమస్యలు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. 66 మంది రైతులు సమస్యలపై అర్జీలు ఇచ్చారు. వాటిలో ఎక్కువగా విస్తీర్ణం కొలతలలో తేడాలు ఉన్నట్లుగా చెప్పారు. కార్యక్రమ ంలో ఆర్ ఐ సాహితీ మోహన్, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి దుగ్గిరాల : భూములకు సంబంధించిన ఎటువంటి సమస్యలు ఉన్న గ్రామ సభలో అర్జీ ద్వారా తెలిపినట్లైతే రైతులకు ఎటువంటి సమస్యలు లేకుండా పరిష్కరిస్తామని తాసిల్దార్ ఐ సునీత అన్నారు. మండల ంలోని కంఠం రాజు కొండూరు గ్రామంలో బుధవారం నిర్వహించిన గ్రామ సభ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఈనెల 22 తేదీ నుండి రీ సర్వే నిర్వహించిన ఏడు గ్రామాల్లో ఇప్పటివరకు 175 అర్జీలు వచ్చాయన్నారు. కొందరు రైతులు భూమి తక్కువ వచ్చిందని తెలిపగా మరి కొంత మంది రైతులు ఎక్కువ వచ్చిందని తెలిపారు అన్నారు. కార్యక్రమ ంలో సర్వే యర్ గోపాలరావు రీసర్వ్ డిటి ప్రశాంతి ఆర్ఐ శివ త్రివేణి వీఆర్వోలు కిషోర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రూ.20 వేలు పెట్టుబడి సాయం ఇవ్వాలి

రైతు, కౌలురైతు సమస్యల పరిష్కారానికి 4 నుండి ఆందోళనకు కార్యాచరణ

ప్రజాశక్తి - మంగళగిరి

రాష్ట్రంలో ఆధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ప్రకటించిన సూపర్ సిక్స్ లో భాగంగా ప్రతిరైతు, కౌలురైతులకు రూ.20 వేలు పెట్టుబడి సాయం అందజేస్తామని, వాగ్దానం చేసిందని, ఖరీఫ్ పోయి రబీ ప్రారంభమైన ఇంతవరకు ఇవ్వక పోవడం శోచనీయమని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం ప్రధాన కార్యదర్శి కె.వి. వి ప్రసాద్ అన్నారు. బుధవారం మంగళగిరి పట్టణంలోని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే వి వి ప్రసాద్, కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి జమలయ్య, పసుపు రైతుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు యాళ్లగడ్డ వెంకటేశ్వరరావు మాట్లాడారు. రాష్ట్రంలో ఇటీవల సంభవించిన తుపాన్లు, భారీ వరదల వల్ల రైతులు, కౌలు రైతులు నష్టపోయారన్నారు ఖరీఫ్, రబి లోనూ పంటల బీమా ప్రీమియంను రాష్ట్ర ప్రభుత్వమే చెల్లించాలని డిమాండ్ చేశారు వీరి సమస్యల పరిష్కారానికి నవంబర్ 4వన గ్రామ సచివాలయం వద్ద ధర్నాలు చేయాలని, నవంబర్ 11వ తేదీన తాసిల్దారు కార్యాలయ వద్ద ఆందోళన నిర్వహించాలని, నవంబర్ 20న జిల్లా కలెక్టరేట్‌ల వద్ద ధర్నాలు నిర్వహించి రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.రాష్ట్రంలో 54 కరువు మండలాలుగా ప్రకటించారని ఈ సంఖ్యను పున సమీక్షించి వర్షపాతం తక్కువగా ఉండి, సాగుచేయని ప్రాంతాలను కూడా పరిగణలోకి తీసుకొని కరువు మండలాల సంఖ్యను పెంచాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. కరువు మండలాల్లో పంట రుణాలు రద్దు చేయాలని, ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవడానికి విత్తనాలను ఉచితంగా ఇవ్వాలన్నారు . రబీలో పంటలు వేసుకోవడానికి రైతులకు,కౌలు రైతులకు తక్షణమే పంట రుణాలు అందించాలని కోరారు..

స్వచ్ఛత పాటిద్దాం - ఆరోగ్యాలు కాపాడుకుందాం

జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి - గుంటూరులో యువత ర్యాలీ

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

స్వచ్ఛత పాటించి ఆరోగ్యాలు కాపాడుకోవాలని గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ సూపరింటెండెంట్ ఎస్ ఎస్ వి రమణ అన్నారు. కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ, నెహ్రూ యువకేంద్రం అద్వర్యంలో ఈ దీపావళి మై భారత్ కోసం అన్న కార్యక్రమంలో భాగంగా బుధవారం ప్రభుత్వ ఆస్పత్రిలో స్వచ్ఛతా కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమ లో ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ ఎస్ ఎస్ వి రమణ మాట్లాడుతూ పరిసరాలు స్వచ్ఛత ఉంటె ఆరోగ్యం ఉంటామని, గవర్నమెంట్ హాస్పిటల్‌లో నెహ్రు యువ కేంద్ర అధ్వర్యంలో 100 మంది వంటీర్లతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించటం సంతోషాన్ని ఇచ్చిందని అన్నారు. గుంటూరు నెహ్రూ యువ కేంద్ర జిల్లా యువ అధికారి కిరణ్మయి దేవిరెడ్డి మాట్లాడుతూ యువత అన్ని రకాలుగా ఎదుగుదలకు అవకాశాలు కల్పించేందుగు ఏర్పాటు చేసిన మై భారత్ పోర్టల్ ఏర్పాటు చేసి ఏడాదైన సందర్భముగా గత మూడు రోజులుగా దీవాలి విత్ మై బారత్ అనే కార్యక్రమం గుంటూరులో మార్కెట్, గవర్నమెంట్ హాస్పిటల్ వంటి ప్రదేశాలలో స్వచ్ఛత కార్యక్రమాలు నిర్వహించామని అన్నారు. ఈ సందర్భముగా గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ పరిసరాలలో స్వచ్ఛత నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జె వి సుధీర్ కుమార్, ఎన్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

డిఇఒ రేణుకను అభినందిస్తున్న యుటిఎఫ్ నాయకులు

నూతన డిఇఒకు యుటిఎఫ్ శుభాకాంక్షలు

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు జిల్లా విద్యాశాఖ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన సి.వి.రేణుకను యుటిఎఫ్ నాయకులు అభినందించారు. బుధవారం డిఇఒ కార్యాలయంలో రేణుకను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగం బలోపేతానికి కృషి చేయాలని, ఉపాధ్యాయుల సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కోరారు. డిఇఒ మాట్లాడుతూ అందరి సహకారంతో గుంటూరు జిల్లా రాష్ట్రంలో విద్యాభివృద్ధిలో ముందు వరుసలో ఉంచటానికి కృషి చేస్తానన్నారు. డిఇఒను కలిసిన వారిలో యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్..వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.ఆదిలక్ష్మి, యం.కళాధర్, సహాఅధ్యక్షులు జి. వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శులు ఆదినారాయణ, వెంకటేశ్వరరావు, గోవిందు, రాజశేఖర్‌రావు, కోటిరెడ్డి, ప్రేమ్ కుమార్, ప్రభూజీ, షకీలా బేగం, నాగమణి, అన్నపూర్ణ, యామిని, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు

హామీలు అమలు చేయని ప్రభుత్వం

వైసిపి జిల్లా అధ్యక్షులు అంబటి రాంబాబు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చని కూటమి ప్రభుత్వం తప్పుడు కేసులతో వైసిపి నాయకులను వేధిస్తుందని వైసిపి జిల్లా అధ్యక్షులు అంబటి రాంబాబు ఆరోపించారు. గుంటూరులోని వైసిపి జిల్లా కార్యాలయంలో బుధవారం పత్తిపాడు నియోజకవర్గం కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాంబాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రోజురోజుకు దిగజారుడు రాజకీయాలు చేస్తుందని తెలిపారు. ప్రభుత్వ పాలనపై దృష్టి పెట్టకుండా కేవలం వైసిపి కార్యకర్తలను నాయకులను వేధిస్తూ కాలయాపన చేస్తున్నారని అన్నారు. హామీలు అమలు చేయకపోవడంతో ప్రజల్లో కూటమి ప్రభుత్వంపై వ్యతిరేకత వచ్చిందన్నారు. పార్టీ బలోపేతం కోసం గ్రామస్థాయి నుండి పార్టీ కమిటీలను ఏర్పాటు చేస్తామన్నారు. గుంటూరు పార్లమెంట్ పరిశీలకులు మోదుగుల వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ గత ఎన్నికల్లో ఓటమిని కల కారణాలను గుర్తించి వాటిని సరిదిద్దుతూ పార్టీని పటిష్ట పరిచేందుకు కృషి చేస్తామన్నారు. గ్రామస్థాయి నాయకత్వాన్ని పార్టీ గుర్తించి వారిని గౌరవం పరిచే విధంగా కార్యాచరణను సిద్ధం చేస్తామని చెప్పారు. పత్తిపాడు నియోజకవర్గ సమన్వయకర్త బాలసాని కిరణ్ కుమార్, పార్టీ నాయకులు మండే పూడి పురుషోత్తం, మాదిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, కాకుమాను రామకష్ణ, కాసిం పీరా,వెంకటలక్ష్మి, మురళి, ఓం ప్రకాష్, సాంబశివరావు, సుందర్ రెడ్డి, పార్టీ నాయకులు పిల్లి మేరీ, కవిత, రామచంద్రయ్య, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

పలు పాఠశాలల్లో ముందస్తు దీపావళి

భాష్యం విద్యా సంస్థల్లో..

ప్రజాశక్తి-గుంటూరు : భాష్యం విద్యా సంస్థలలో బుధవారం ముందస్తు దీపావళి వేడుకలు నిర్వహించారు. చిన్నారులు సంప్రదాయ వస్త్రాలతో, కేరింతలు కనువిందు చేశాయి. భాష్యం మెయిన్ క్యాంపస్‌లోని లిటిల్ ఛాంప్స్‌లో జరిగిన వేడుకల్లో ఉపాధ్యాయ బృందం సరస్వతికి అమ్మవారి ముందు దీపాలు వెలిగించారు. అనంతరం విద్యార్థులతో బాణసంచా కల్చి, ఆనందోత్సాహాల మధ్య దీపావళి వేడుకలు నిర్వహించారు. అదేవిధంగా భాష్యం ఇతర క్యాంపస్‌లలో దీపావళి వేడుకలు జరిగాయి. కార్యక్రమంలో లిటిల్ ఛాంప్స ప్రిన్సిపాల్స్ శిరీష, వైస్ ప్రిన్సిపల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కెఎల్‌పిలో..

నరకాసురుడిని దహనం చేస్తున్న సెక్రెటరీ తదితరులు

ప్రజాశక్తి-గుంటూరు : స్థానిక జెకెసి కాలేజి రోడ్డులోని డాక్టర్ కెఎల్‌పి పబ్లిక్ స్కూల్లో బుధవారం ముందస్తు దీపావళి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ మాట్లాడుతూ పర్యావరణ హిత బాణసంచాను వినియోగించాలని సూచించారు. ప్రిన్సిపాల్ జి.రత్తయ్య మాట్లాడుతూ చెడుపై మంచి గెలవటానికి సూచికగా ఈ పండుగ జరుపుకుంటామని, విద్యార్థులంతా మంచి ప్రవర్తన కలిగి ఉండాలన్నారు.

ఏక్‌తా దివాస్.. : ఉక్కు మనిషిగా పేరుగాంచిన డాక్టర్ సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకొని పాఠశాలలో జాతీయ సమైక్యతా దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులు సమైక్యతా ప్రతిజ్ఞ చేశారు. సెక్రెటరీ డాక్టర్ కృష్ణప్రసాద్, ప్రిన్సిపాల్ జి.రత్తయ్య వల్లభాయ్‌పటేల్ జీవిత విశేషాలను వివరించారు.

కన్న స్కూల్లో ...

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక ఆర్‌టిసి కాలనీలోని కన్న హైస్కూల్లో బుధవారం ముందస్తు దీపావళి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కన్న విద్యా సంస్థల అధినేత కన్న మాస్టారు విద్యార్థులను ఉద్దేశించి చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా దీపావళి జరుపుకుంటామని తెలిపారు. ఈ సందర్భంగా చిన్నారులు వివిధ వేషధారణాలతో ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో చిన్నారులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

తెనాలి రత్నశ్రీ పాఠశాలలో ..

ప్రజాశక్తి - తెనాలి : స్థానిక చెంచుపేటలోని రత్నశ్రీ స్కూల్ ప్రాంగణంలో దీపావళి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. చిన్నారులు సాంప్రదాయబద్ధంగా దీపావళి వేడుకలలో పాల్గొని ఉత్సాహంగా దీపాలు వెలిగించారు. స్కూల్ డైరెక్టర్ ఇర్షాద్ సల్మా, ప్రిన్సిపల్ వై లక్ష్మీ ప్రసన్న ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో విద్యార్థులకు, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు దీపావళి విశిష్టతను వివరించారు. దీపావళి ప్రాధాన్యత విషయాలను గురించి విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో ఉపాధ్యాయులు తెలిపారు. దీపావళి పండుగను ప్రశాంత వాతావరణంలో , ఉత్సాహంగా నిర్వహించుకోవాలని సూచిస్తూ, దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో స్కూలు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నెహ్రూ నికేతన్‌లో ..

ప్రజాశక్తి - తెనాలి

స్థానిక బోస్ రోడ్ లోని నెహ్రూనికేతన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ లో బుధవారం ముందస్తు దీపావళి వేడుకలు నిర్వహించారు. పాఠశాల మేనేజింగ్ డైరెక్టర్ మురళి కాంత్ దాసరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గీతాకాంత్ దాసరి పర్యవేక్షణలో నిర్వహించిన వేడుకలలో చెడుపై మంచి సాధించిన విజయానికి చిహ్నంగా దీపావళి వేడుకలు జరుపుకుంటారని విద్యార్థులకు వివరించారు. పర్యావరణ కాలుష్యం, శబ్ద కాలుష్యం లేకుండా దీపావళి వేడుకలు జరుపుకోవాలని చెప్పారు. పర్యావరణ పరిరక్షణ కోరుకుంటూ ప్రతి ఒక్కరు దీపావళి సందర్భంగా మొక్కను నాటడం అలవాటు చేసుకోవాలని చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులు నూతన వస్త్రాలను ధరించి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం విద్యార్థులు పాల్గొన్నారు.

శిక్షణలో పాల్గొన్న విద్యార్థులతో ప్రిన్సిపాల్ తదితరులు

చలపతిలో ముగిసిన వెబ్ డెవలప్‌మెంట్ శిక్షణ

ప్రజాశక్తి-గుంటూరు : లాంలోని చలపతి ఇంజినీరింగ్ కాలేజిలో ఫుల్‌స్టాక్ వెబ్ డెవలప్‌మెంట్ అనే అంశంపై ఆరు రోజుల శిక్షణా శిబిరం బుధవారం ముగిసింది. ఈ శిక్షణకు ముఖ్య అతిథిగా ఇన్నోవేటివ్ టెక్నాలజీస్ ప్రైవేటు లిమిటెడ్ నుండి ఎ.సాయి, వి.రాజేష్ పాల్గొని శిక్షణ ప్రాముఖ్యతను వివరించారు. కళాశాల సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ వై.సుజిత్‌కుమార్ మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో ఇటువంటి శిక్షణా శిబిరాల ద్వారా ప్రతి యొక్క వ్యక్తిగత సమాచారాన్ని, వెబ్‌పేజీని ఎలా రూపొందించుకోవాలో, ఫోటోలు, వీడియోలు ఎలాగ వెబ్‌పేజీలో పెట్టాలో ప్రతి ఒక్కరూనేర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ యం.చంద్రశేఖర్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగాధిపతి జె.భార్గవ్, డేటాసైన్స్ విభాగాధిపతి కె.అరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌విఆర్‌లో జాతీయ ఐక్యతా దినోత్సవం

ప్రజాశక్తి-గుంటూరు

భారతదేశ అభ్యున్నతికి సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ చేసిన సేవలు చిరస్మరణీయమని ఆర్‌విఆర్ అండ్ జెసి ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్ కె. మద్దినేని పేర్కొన్నారు.మాజీ ఉప ప్రధాని సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకొని బుధవారం ఆర్‌విఆర్ కళాశాలలో అధ్యాపకులు, అధ్యాపకేతర బృందం విద్యార్థులతో కలిసి ప్లకార్డులను చేతబట్టి 'ఏక్తా దివాస్' ర్యాలీని నిర్వహించారు. అనంతరం ఐక్యతా ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో కాలేజి సెక్రెటరీ, కరస్పాండెంట్ రాయపాటి గోపాలకృష్ణ, ట్రెజరర్ వల్లభాయ్‌పటేల్, ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఐక్యతా ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు